# శాంతి


# SANTI

విశ్వమానవ సాభ్రాతృత్వ సందేశము గల ఆధ్యాత్మిక మాసపత్రిక

సెప్టెంబరు/September - 2021



ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్ తన్మయో భవేత్



## పరమపూజ్య శ్రీ స్వామి ఓంకార్ మహారాజ్

జననం : 1895 నిర్యాణం : 1982

# లోకశాంతి ప్రార్థన

(వ్యక్తి శాంతికి - విశ్వశాంతికి)

పూజనీయమైన ఓ దివ్య స్వరూపా!
మా లోపలను వెలుపలను మీదను క్రిందను అంతటను
నిండియున్న ఓ సర్వాంతర్యామి! మా లోపల ప్రత్యణువు
నందును ఇమిడి యుండి మా నేత్రములకు నేత్రము,
కర్ణములకు కర్ణము, హృదయములకు హృదయము,
మనస్సులకు మనస్సు, శ్వాసలకు శ్వాస, ప్రాణములకు ప్రాణము,
ఆత్మలకు ఆత్మవై వెలుగొందు ఓ దేవా ! ప్రేమైక మూర్తీ !
నిన్ను తెలుసుకొను భాగ్యము ఇప్పుడు ఇచ్చటనే మాకు ప్రసాదింపుము.
ఓ తేజోమయమూర్తీ! తూర్పు పడమరల
ఉత్తర దక్షిణముల, ఈ విశ్వము నందంతటను అందరును
నీ దివ్య తేజస్సును గ్రహింతురు గాక!
ఓ సచ్చిదానంద స్వరూపా !
ప్రతి మానవ హృదయమునందును, నానాజాతి మధ్యమునను
శాంతి సామరస్యములను ప్రతిష్ఠింపజేయుము.
ఓ దేవా! ఇదియే మా మన: పూర్వకమైన ప్రార్థన.

**లోకాస్సమస్తా స్సుఖినో భవంతు !**

**ఓం శాంతి శ్శాంతి శ్శాంతి :**

ఏకం సత్ విప్రా బహుధా వదంతి
ఒకే సత్యము అనేక విధములుగా బ్రహ్మజ్ఞులచే చెప్పబడినది.

- ఋగ్వేద సంహిత

# శాంతి

# SANTI

విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక

**స్థాపకులు : పరమపూజ్య శ్రీస్వామి ఓంకార్‌జీ మహరాజ్**

**సంపాదకులు : స్వామిని వినమ్రానంద**

సంపుటి / Vol. 97 | సెప్టెంబరు/September - 2021 | సంచిక/No.9

వ.నెం. | విషయ సూచిక | పేజి నెం.


| వ.నెం. | విషయ సూచిక | పేజి నెం. |
|---|---|---|
| 1. | ప్రార్థన | 2 |
| 2. | ధ్యానము - మహా నారాయణోపనిషత్తు | 2 |
| 3. | ఓంకార్ ఆత్మకథ - అనువాదం : శ్రీమతి బొప్పన అరుణాదేవి | 3 |
| 4. | సజ్జనులతో స్నేహము శ్రేయోదాయకము - స్వామిశివానంద | 7 |
| 5. | జీవితము యొక్క విలువ - స్వామి ఓంకార్ | 10 |
| 6. | శ్రీ తులసీ వివాహము - జి.వి.యస్. సుబ్రహ్మణ్య శర్మ | 13 |
| 7. | సంన్యాసము - వాడ్రేవు శారద | 15 |
| 8. | విలువలు - సిలువేరు సుదర్శన్ | 17 |
| 9. | సేంద్రియ ఉత్పత్తులు - శ్రీమతి సత్యరాణి | 20 |
| 10. | నాకెందుకు వజ్రపుటుంగరము - స్వామి చిన్మయానంద | 23 |
| 11. | విజ్ఞప్తి - గో సంతతికై గోశాల విస్తరణ | 25 |
| 12. | దాతలకు విజ్ఞప్తి | 26 |
| 13. | కార్యక్రమములు, విరాళములు | 27-28 |


**★ ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి / రచయితలే బాధ్యులు కాని. సంపాదకులు కారు.**

**జీవిత సభ్యత్వం రూ. 1000/-లు సాలుసరి రూ.100/-**

# ప్రార్థన

## దేవుని ప్రార్థించుటయే ముఖ్య కర్తవ్యము

**ఓం గణానాం త్వా గణపతిగ్ం హవామహే కవింకవీనా ముపమశ్రవస్తమమ్ ।**
**జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత ఆనః శృణ్వన్నూతిభిస్సీద సాదనమ్ ॥**

**మహాగణపతయే నమః**

దేవ గణాలకు అధిపతివి కనుక గణపతిగా పేరుగాంచిన నిన్ను కీర్తించి ఆహ్వానిస్తున్నాము. మేధావులలో నీవు అగ్రగణ్యుడవు. సాటిలేని ఖ్యాతి గాంచిన వాడవు. ప్రధానులలో శ్రేష్ఠత ముడవు. వేదములకు అధిపతివి. మా ప్రార్థనలను ఆలకించి మమ్ము రక్షింప సత్వరముగా వచ్చి అనుగ్రహించెదవు గాక! మహా గణపతియైన నీకు నమస్కారము.

# ధ్యానము

### (మహా నారాయణోపనిషత్తు నుండి)

## ధ్యానం మీరు చేసే కర్మకు సహాయపడుతుంది

**దహ్రం విపాపం పరమేశ్వభూతం యత్**
**పుణ్డరీకం పురమధ్యసంస్థమ్**
**తత్రాపి దహ్రం గగనం విశోకం తస్మిన్**
**యదన్త స్మదుపాసితవ్యమ్**

శరీరం మధ్యభాగంలో ఒక పవిత్రమైన, సూక్ష్మమైన, పద్మం వంటి రూపం ఒకటి నెలకొనివుంది. దాని మధ్యలో సుఖదుఃఖాలకు అతీతమైన ఆకాశం ఉంది. ఆ ఆకాశం మీద ధ్యానించాలి.

మనలో ఉన్న హృదయ స్థానం మీద మనస్సును ఏకాగ్రం చేయండి. ఆ హృదయమే ఈ విశ్వచైతన్యపు కేంద్రంగా భావించండి. మీలో ఉన్న దివ్య చైతన్యమే మీ చుట్టూ ఉందనీ, అంతేకాక అఖండమూ, అనంతమూ అయిన విశ్వ చైతన్యంలో అది ఒక విడదీయరాని భాగమనీ భావించండి.

# శాంతి ప్రదాత శ్రీ ఓంకార్ స్వామీజీ ఆత్మకథ

అనువాదం : శ్రీమతి బొప్పన అరుణాదేవి

**అధ్యాయం - 30**

**మౌనవ్రతం**

## దివ్య తేజస్సును అనుభవించుటయే ప్రతిజీవి కర్తవ్యం

ప్రతి అనుభవాన్ని చాలా గొప్పగా చేసుకోవటం నా స్వభావం. అనుభవం సంతోషమయినా, దుఃఖయినా సరే, అలాగే అది మంచిదయినా లేక చెడ్డదయినా పర్వాలేదు. అడ్డంకులను అధిగమించి వాటినే పునాదిరాళ్ళుగా మార్చుకోగలిగిన వాళ్ళు భగవంతుని అనుగ్రహానికి పాత్రులవుతారు. తుంటి ఎముక రెండు చోట్ల విరగటం వలన నాకు కాలి వేలి దగ్గర నుండి తుంటి ప్రాంతం వరకు విపరీతమయిన నొప్పి వస్తుండేది. అలాంటప్పుడు కూడానేను ఆధ్యాత్మిక మార్గంలో పురోగమించాలని సాధన చేసే సాధకులయిన నా భక్తులకు భగవదనుభూతి పొందటానికి సహాయపడటానికి ప్రయత్నించేవాడిని. అలుముకున్న మబ్బులు, అడ్డంకులు, బాధలు ఈ రోజో రేపో అతి తొందరలోనే తొలగిపోతాయి. లేదా కొంతకాలము పట్టవచ్చు. శాశ్వతంగా, నిత్యంగా ఉండేది. దేదీప్యమానంగా తేజోమయంగా వెలుగులు ఇచ్చేది మన అంతఃకరణంలో వెలిగే ఆత్మజ్యోతి మాత్రమే. దీనిని అందుకోవటము ప్రతి వ్యక్తికి గమ్యం కావాలి.

డాక్టరు డెల్‌వెల్లి దయగల నర్సు, డెల్‌వెల్లి గారి ధర్మపత్ని ఇంకా ఇతర వైద్యబృందము, భక్తులు అందరూ ఎంతో ప్రేమతో నన్ను చాలా జాగ్రత్తగా సంరక్షించారు. వాళ్ళందరూ కూడా తమ సొంత కుటుంబ సభ్యుడిలాగా, వారి జీవితంలో ఒక భాగంలాగా భావించి సేవలు చేశారు. నన్ను చూడడానికి దగ్గరిలోని వారేకాకుండా ఎంతో దూర ప్రాంతాల నుండి కూడా భక్తులు, సాధకులు వస్తు ఉండేవారు. నా శరీరంలో సగభాగం కట్లతో నిండిపోవటం వలన నాకు చాలా ఇబ్బందిగా ఉండేది. జాన్ హెన్‌రాహన్ ప్రఖ్యాత న్యాయవాది. చాలా మంచివాడు. నా ధ్యాన తరగతులకు తప్పనిసరిగా హాజరయ్యేవాడు. నన్ను చూడడానికి ప్రతిరోజు తప్పకుండా వచ్చేవాడు.

హన్‌రాహన్ ప్రకృతి వైద్యంలో నిపుణుడు కావటం వలన నా ఒళ్ళంతా చక్కగా మసాజ్ చేసేవాడు. మసాజ్, తొట్టి స్నానం ఇంకా ఇతర ప్రకృతి వైద్య విధానాలు శరీరానికి మంచి ఆరోగ్యాన్నిచ్చి చాలా సహాయం చేస్తాయి. నేను మంచం పై పడుకొని ఉంటే నా శరీరాన్ని అతి లాఘువంగా కట్టు ఉన్న భాగాన్ని తాకకుండా మసాజ్ చేసేవాడు. కొన్నిసార్లు అర్ధరాత్రి వరకు నాకు సేవచేస్తూ ఉండిపోయేవాడు. దాదాపు రాత్రి 2,3 గంటలకి ఇంటికి చేరుకునేవాడు. చాలా దూరం ప్రయాణం చేయాల్సి వచ్చేది. అతను ఎంతటి దయ, ప్రేమ, కరుణ కలిగిన వ్యక్తి! అతని అద్భుతమయిన, శక్తిమంతమయిన మసాజ్‌ని, పవిత్రమయిన ఓంకారాన్ని జపిస్తూ గంటల తరబడి చేసేవాడు. అతను శాంతి కేంద్రాలలో నా సందేశాలను శ్రోతలకి వినిపిస్తూ ఉండేవాడు. నా సందేశాలను అతని కార్యాలయములో టైపు చేసి తెస్తుండేవాడు. ఇలా ఎన్ని రకాల సేవలు అవి, ఇవి అన్ని చెప్పలేనివి ఎన్నో చేసేవాడు. అంకితభావంతో, ఎంతో నమ్మకమయిన తూర్పు దేశాల్లో అంతరంగ శిష్యుడిలా ప్రవర్తించేవాడు. భగవంతుడు ఎంత దయామయుడు. నా పట్ల ఎంతటి కరుణామృతాన్ని వర్షించాడు!!

నన్ను దర్శించడానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించినా వేరే సమయాల్లో కూడా కొందరికి అవకాశం ఇవ్వవలసి వచ్చేది. వైద్యులు, సన్నిహితులు, అంతరంగ భక్తులు, అలాగే చాలా దూర ప్రాంతాల నుండి వచ్చేవారికి మినహాయింపు ఉండేది. కొందరు వృద్ధులు కూడా వచ్చేవారు. అలాంటప్పుడు వారిని నేను కాదు అని చెప్పలేకపోయేవాడిని. నేను మంచం మీద కట్లతో పడి ఉండడం వలన శ్రీమతి లిల్లి ఇంటి ఆవరణలో జరిగే శాంతి సమావేశాలు తరుచుగా నా గదిలోనే జరుగుతుండేవి. అలాంటప్పుడు కేవలం  కొద్ది మంది భక్తులు నా మంచం చుట్టూ కుర్చీలలో కూర్చునేవారు. మంచి భక్తులరాలయిన ఒక నర్సు నా గురించి ఎంతో శ్రద్ధ వహించి సేవలు చేసేది.  ఆమె పేరు విక్టోరియా, తను నన్ను ఒక స్నేహితుడిలా, అన్నలా భావించేది. ఆమె శాంతి సందేశాలను ఇష్టపడి నిస్వార్థమయిన సేవలు అందించటానికి భారతదేశం వచ్చి శాంతి ఆశ్రమంలో ఉండాలని చాలా ఆరాటపడేది. నాకు సేవలు చేయటంతో పాటు, నాకు వచ్చే ఉత్తరాలకి ప్రత్యుత్తరాలు వ్రాయటం చేసేది. అమెరికా భక్తులు, అలాగే భారతదేశం నుండి ఎందరో భక్తులు ఉత్తరాలు వ్రాస్తుండేవారు. ఆమె తన పేరును సేవాదేవి అని మార్చుకుంది. ఒక దేవతలాగా ఆమె నాకు రాత్రి, పగలు ప్రేమతో సేవలు అందించింది.

నేను తప్పనిసరిగా విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చింది కనుక ఆ సమయాన్ని బాగా సద్వినియోగం చేసుకోవాలని నిశ్చయించుకున్నాను. అది నా ఆధ్యాత్మిక జీవితానికి గొప్ప ప్రగతిని ఇస్తుంది. దివ్య చైతన్యంలో లీనమవటానికి అంతర్ముఖమవటానికి, అంతరంగంలో వెలిగే దివ్య జ్యోతిని అనుభవంలోని తెచ్చుకోవడానికి వినియోగించుకోవాలని భావించాను. నలభై రోజులు మౌన దీక్ష చేయాలని ఒక మాట కూడా మాట్లాడకూడదని కట్లుతో మంచంపై బాధ పడుతున్నప్పటికీ అలాగే చేయాలని నిశ్చయించుకున్నాను. మౌనదీక్షలో ఉన్న సమయంలో ఏదయినా చేయాలన్నా, చెప్పాలన్నా కాగితం మీద వ్రాసి చూపించేవాడిని. విదేశీయులకు మౌనదీక్ష అంటే తెలియదు. అందువలన దానిని అర్థం చేసుకోవటం వారికి చాలా కష్టంగా ఉండేది. కొన్నిసార్లు ఒకదానికి ఒకటని అర్థం చేసుకొనేవాళ్ళు. ప్రత్యేకంగా నేను జబ్బుతో మంచంలో ఉండగా మౌనదీక్ష ఏమిటి అని వారికి అనిపించేది. నాకు ఎంతో ప్రేమతో సేవలు చేసే నర్సుకి ఇది చాలా ఇబ్బందిగా ఉండేది. కాని ఒకటి రెండు రోజుల్లోనే వాళ్ళకి నా మౌనాన్ని అర్థం చేసుకోవటం తేలికయింది. భక్తులకి, నన్ను చూడడానికి వచ్చేవారికి కూడా నెమ్మదిగా అలవాటయింది.

సాయంత్రపు సమయాల్లో నాకు సేవ చేయడానికి స్పానిష్ నర్సు వచ్చేది. ఆమె మంచి భక్తురాలు. ఆమె ఎంతో సంతోషంగా తను పెంచుకొంటున్న పెంపుడు కొండచిలువ గురించి నాకు చెపుతూ ఉండేది. ఆమె దాన్ని తనతో తాను నివసిస్తున్న అపార్టుమెంటులోనే పెంచుకుంటున్నది. అది చాలా పెద్దపాము అవటం వలన మిగిలిన అపార్టుమెంటుల్లో ఉండేవాళ్ళు చాలా భయపడేవారు. న్యూయార్క్ లాంటి జన సాంద్రత గల పెద్ద నగరాల్లో అలాంటి ప్రమాదకరమైన కొండచిలువను ఇంటిలో ఉంచుకోవటం మంచిది కాదని చెప్పేవారట. కాని ఆమె తాను పెంచుతున్న పాము ఎలాంటి హాని చేయదని, అది చాలా సాధు జంతువని చెప్పేది. అంత పెద్ద పాము ఆ నర్సుతో పాటు నిద్రపోతుంది అని తెలిసి నేను చాలా ఆశ్చర్యపడ్డాను. వాళ్ళిద్దరూ ఒకరినొకరు ఎంతో ప్రేమించుకునేవారు. ప్రేమ

ఎక్కడ ఉంటుందో దైవం అక్కడ ఉంటాడు. ప్రేమ మూగజీవాల ద్వారా లేదా మానవుల ద్వారా ప్రకటించబడినా అక్కడ దివ్యత్వం నెలకొంటుంది.

నేను మౌనదీక్షలో ఉన్న సమయంలో నా హృదయంలో అనేక ఆలోచనలు, భావాలు మొదలుతుండేవి. వాటిని అందరికీ ఉపయోగపడాలని ఇక్కడ వ్రాస్తున్నాను.

"ప్రియమైన బిడ్డా! భగవదనుభవం పొందడానికి నలభై రోజులు మౌన వ్రతం కావాలా? ఈ క్షణంలో దైవము నీతో లేదా? దైవాన్ని ఇప్పుడు నీవు మర్చిపోయినందుకు నీకు సిగ్గు అనిపించటం లేదా? నీవింతగా నమ్మకాన్ని ఎలా కోల్పోయావు? జీవమున్న ప్రతి ప్రాణి హృదయంలో నివసించే దైవాన్ని నీవు ఎలా విస్మరించగలవు? నలభై రోజుల మౌనదీక్ష అవసరమా భగవంతుని తెలుసుకోవడానికి? ఆయన ఈ క్షణంలోనే నీ స్వరూపంగానే విరాజిల్లుతున్నాడు కదా? కంటికి కనిపించని ఆత్మ స్వరూపంగా విశ్వమంతా వ్యాపించి లేడా? నలభై రోజుల మౌనదీక్ష బదులుగా నలభై గంటలు సరిపోదా? లేదా నలభై నిముషాలు సరిపోవా? అది కూడా చాలా ఎక్కువ సమయం కాదా? నలభై సెకండ్లు చాలవా? నీ లోపల ఆత్మ చైతన్యం దేదీప్యమానంగా వెల్గుతుంటే నలభై సెకండ్ల కాలం కూడా ఎలా ఎదురుచూడగలవు? మేల్కొని, లేచి నీలోనికి నీవు మునిగిపో, ఆత్మలో లీనమయిపోతావు. గట్టిగా పట్టుకో, దైవం నీలోనే ఉన్నాడు. ఈ క్షణంలో ఈ క్షణం నీలోనే జీవిస్తున్నాడు. ఇప్పుడు, ఈ క్షణంలోనే నీవు గుర్తించు. ఒక్క సెకనులో నీలోని ఆ దివ్య చైతన్య స్వరూపాన్ని తేజోమయ కాంతిని గుర్తించి అందులో మునిగిపో, అప్పుడు నీవే దైవము, దైవమే నీవు. ఎలాంటి అభేదము ఉండదు. ఆ చైతన్యానికి సమయము, దేశము, కారణము అనే పరిధులు ఉండవు. శాంతిగా ఉండు".

**తత్త్వమసి, అది నీవే అయి ఉన్నావు**

ఆ రోజులు నిజంగా దైవానుగ్రహం వలన అనుక్షణము పరమాత్మ సన్నిధిని మౌనదీక్షలో హాయిగా అనుభవిస్తూ గడిచిపోయాయి. మౌన దీక్షతో పాటుగా ఉపవాస దీక్ష కూడా చేయాలనుకున్నాను. నాకు ఉపవాస దీక్ష చేయటం అంటే చాలా ప్రీతి. కాని నాకు వైద్యం చేస్తున్న వైద్యులు, స్నేహితులు, ప్రియమయిన భక్తులు ఆ ఆలోచనని పూర్తిగా మానుకోవాలని అభ్యర్థించారు. అందువలన నేను కేవలం మౌన దీక్షతో తృప్తిపడి ఉపవాసదీక్షను మానుకున్నాను.

చాలా మంది నన్ను చూడడానికి వచ్చేవారు. విచారవదనాలతో వస్తుండేవారు. వారికి నన్ను ఒంటి నిండా కట్లతో మంచం మీద ఒక రోగిలా చూడడం చాలా బాధగా ఉండేది. కాని నేను ప్రపంచంలోని అందరికన్నా సంతోషంగా, ఆరోగ్యంగా ఉండే వ్యక్తిలా అనుకునేవాడిని. సంతోషంగా చిరునవ్వుతో ఉన్న నన్ను చూడగానే వారందరూ వారి దుఃఖాన్ని, బాధని మర్చిపోయి వాళ్ళు కూడా ఆనందంగా మారిపోయేవాళ్ళు. వచ్చినవాళ్ళు కాసేపు నా గదిలో మౌనంగా ధ్యానంలో గడపగానే వాళ్ళ ముఖంలో నూతన తేజస్సు, హృదయంలో ఆనందం, ప్రశాంతత, ప్రేమ అంకురించేవి. నాకు ఇంకా గుర్తుంది. అలా దిగాలుగా వచ్చే వారి గురించి మంచి భావాలు, ఆలోచనలు, ఆధ్యాత్మిక సూచనలు కాగితం మీద వ్రాసి ఇచ్చేవాడిని.

**దైవసన్నిధికి ఆహ్వానం**

"మీ ప్రేమామృతమయిన దర్శనానికి ధన్యవాదాలు.

మీరు చూపించే ప్రేమకు ప్రతిఫలంగా ఏమి ఇవ్వగలను? దయచేసి మీ హృదయంలో ప్రేమా, శాంతితో నింపుకోకుండా ఈ గదిని, నన్ను వదిలి వెళ్ళవద్దు. మనం కల్సి నిశ్శబ్దంగా ధ్యానం చేద్దాము. దయచేసి మీ మీ పనులు చేసుకోవటానికి భౌతిక ప్రపంచంలోనికి వెళ్ళేటప్పుడు జ్ఞానజ్యోతిని వెంటతీసుకు వెళ్ళండి. ధ్యానంలో పూర్తిగా మునిగిపోయి ఆ పాంచ భౌతిక దేహాన్ని, బుద్ధిని, ప్రపంచాన్ని పూర్తిగా మర్చిపోదాము. మీ లోపల జ్యోతి వెలుగుతోంది. మీరు ఆ వెలుగులో ఉన్నారు. మీరే ఆ జ్యోతి స్వరూపము. దయచేసి ఆ జ్యోతి మీ లోపలా, బయటా అంతటా పరుచుకొని ఉన్నదని భావన చేయండి. మీ అణువణువులో ఆ దివ్య జ్యోతి వెలుగుతోంది. దయచేసి ఇప్పుడు, ఎల్లప్పుడు ఓంకారాన్ని జపిస్తూ ప్రతి అడుగూ వేయండి. భగవంతుడు మిమ్మల్ని ఆశీర్వదించు గాక! ఎల్లప్పుడు దైవానుభూతిలో ఉందురు గాక!"

నా గది ఎప్పుడూ అందమయిన సువాసనలు వెదజల్లే పూలగుత్తులతో నిండిపోయి ఉండేది. గులాబీలు, లిల్లీలు, క్రిశాంతిమమ్ పూలు, అలాగే ఎన్నో రకాల పళ్ళు, ఆధ్యాత్మిక గ్రంథాలు ఇంకా అనేక ఇతర వస్తువులు గది నిండా ఉండేవి. పాశ్చాత్యులు కూడా మన తూర్పుదేశపు ఆధ్యాత్మిక సోదరుల మాదిరిగా ఏదో ఒక కానుక తీసుకు వస్తారు తప్ప ఖాళీ చేతులతో వెళ్ళరాదు. పెద్దలు చెబుతుంటారు కదా, ఏవరైన మహాత్ములు, సధ్యులు, పెద్దవారు, రాజులు, దేవాలయాలకు వెళ్ళేటప్పుడు ఇట్టి ఏతులతో వోళ్ళ రావు. అని, మన భారతదేశంలో భక్తులు సాధారణంగా కొబ్బరికాయలు, అరటిపళ్ళు, పూలు తీసుకువస్తుంటారు.

ఒక పర్యాయం అమెరికాలో ఒక భక్తురాలు ధ్యానం నేర్చుకున్న తర్వాత "స్వామీజీ! నేను ఎంత మూల్యం చెల్లించాలి?" అని అడిగింది. ఆమెతో నేను చిరునవ్వుతో "నా ప్రవచనాలు ఎవరయినా ఎలాంటి మూల్యము చెల్లించవలసిన అవసరం లేకుండానే వినవచ్చు. ఏ విధంగా సూర్యకాంతిని అనుభవిస్తున్నామో, ఏ విధంగా స్వేచ్ఛగా గాలిని పీలుస్తున్నామో అదే విధంగా స్వేచ్ఛగా పొందవచ్చు" అని చెప్పాను. ఆమె మధురంగా సమాధానమిచ్చింది. "ఓ స్వామీజీ! మీ వద్ద నుండి పొందిన దానికి మేము తప్పకుండా మూల్యం చెల్లించాలి. లేదంటే మేము పొందిన దానికి ఫలితము లభించదు. మూల్యం చెల్లించకుండా ఉచితంగా పొందిన దాని వలన ఎలాంటి ప్రయోజనం కలగదు" అని చెప్పింది. నా స్నేహితులు, భక్తులు చాలా ఉదార స్వభావం కలవారు.

ఈ ప్రపంచంలో అందరూ ధనవంతులే ఉండరు. చాలామంది నిరుపేదలుంటారు. ఎవరికి అవసరం ఉంటుందో, అలాంటి నిరుపేదలకు నాకు తోచిన సహాయం చేసేవాడిని. కొందరు భక్తులు చాలా పెద్ద కుటుంబం, బాధ్యతలు ఉన్నవారు బస్సు చార్జీలు గాని, టాక్సీకి డబ్బులు గాని చెల్లించలేని పేదవారు నన్ను చూడటానికి వస్తుండేవారు. వారికి నేను వెళ్ళేటప్పుడు కవరులో డబ్బులు పెట్టి మూసివేసి ఇచ్చి ఇంటికి వెళ్ళిన తర్వాత తెరిచి చూడమని చెప్పేవాడిని. భగవంతుని బిడ్డలకి చేతనయిన సహాయం చేయటం అంటే స్వయంగా కనిపించని ఆ దైవానికి సేవచేయటమే అవుతుంది. ఇవ్వగలిగే వారు అదృష్టవంతులు.

# సజ్జనులతో స్నేహము శ్రేయోదాయకము

మూలము : స్వామి శివానంద　　　　　　　　　　అనువాదము : గరిగిపాటి కృష్ణ

## అపరిచితులకు ఆశ్రయమిచ్చుట శ్రేయస్కరము కాదు

పూర్వము కళింగ రాజ్యములోని చంద్రవాహి అనే అరణ్యములో ఒక జింక మరియు కాకి పరస్పరము ఎంతో అన్యోన్యముగా జీవించేవి. జింక ఆ సమీపములోని పంట పొలములోని గింజలను, ధాన్యమును యధేచ్ఛగా మేసి రోజురోజుకూ ఎంతో బలిష్టంగా తయారయింది. ఒకనాడు ఆ అరణ్యములోని నక్క ఒకటి ధృడముగాయున్న జింకను చూసి ఇలా అనుకున్నది. "ఈ జింక చర్మము ఎంత మృదువుగా యున్నదోకదా! నేను ఈ జింక విశ్వాసమును చూరగొని దీనితో మైత్రి చెయ్యవలెను. అలా చేసి ఏదో ఒక రోజు ఈ జింక మాంసమును రుచి చూసి తృప్తి చెందవలెననుకున్నది. ఇలా అనుకొని ఆ నక్క జింకను సమీపించి దానిని స్వాగతిస్తూ ఇలా అంది. "నేను ఈ అడవిలో నమ్మకస్తులైన స్నేహితులు లేకపోవడము వలన ఒంటరి జీవితమును అనుభవిస్తున్నాను. నీలో ఉన్న మంచి గుణ, గణాలను తెలిసికొని, నీతో స్నేహము చెయ్యాలని వచ్చాను. ఇక నుండి నేను నీతో స్నేహము చెయ్యవలెనని, అన్ని విషయములలోను నిన్ను అనుసరించాలని తలుస్తున్నాన . జింక తన ఆమోదమును తెలిపి నక్కను వెంటపెట్టుకొని, కాకి నివాస స్థానమైన చెట్టు వద్దకు తీసుకొని వెళ్ళింది.

తన ప్రియ నేస్తమైన జింక నక్కతో కలసి రావడము చూసి, కాకి ఇలా అడిగింది, "ఈ అగంతకుడు ఎవరు? ఈతడు ఎచ్చటి నుండి వచ్చాడు?" అప్పుడు జింక "ఈతడు ఒక నక్క, ఇచ్చటికి సమీపములో ఈ అడవిలోనే ఉంటున్నాడు. ఈతడు మన స్నేహమును అర్థించి మన వద్దకు వచ్చినాడు." అంత కాకి ఈ విధముగా జింకకు తన సలహా నివ్వసాగింది. "ఆకస్మాత్తుగా వచ్చిన ఒక అగంతుకునితో మనకు స్నేహము పనికిరాదు. మన పెద్దలు చెప్పినట్లు అపరిచితులకు ఆశ్రయమునిచ్చుట శ్రేయస్కరము కాదు." అంత నక్క ఈ విధముగా బదులిచ్చింది. "ఎవరినైనా అపరిచితునిగాను, ఊరూ, పేరూ లేని వారిగాను భావించడము ఆ వ్యక్తి సంకుచితమైన మనసుకు అద్దము పడుతుంది. ఈ సమస్త విశ్వమును తనదిగా భావించి, ఇచట నివసించే వారందరూ తమ బంధువులుగాను, స్నేహితులుగాను భావించడమనేది విజ్ఞుల లక్షణము." అప్పుడు జింక ఇలా వాదించుకొనడము వలన ఏమి ప్రయోజనము కలదు? సరే! మనందరమూ కలిసి జీవిద్దాము అన్నది. అప్పుడు కాకి తన నిరాసక్తతను అర్ధాంగీకారము ద్వారా తెలియచేసింది.

రోజులు గడిచాయి. నక్క, జింకల మధ్య స్నేహబంధము చక్కగా కుదిరింది. జింక తన పాత మిత్రుడైన కాకిని మరచి పోసాగింది. అప్పుడు నక్క జింకతో రహస్యముగా ఇలా అంది. "ఓ మిత్రమా! ఇచటికి ఒక మైలు దూరములో మొక్కజొన్న పంటతో నిండిన పొలము

కలదు. నీవు నాతో వస్తే నిన్ను ఆ పొలము వద్దకు తీసుకొని వెళ్ళగలను.” దానికి ఆ జింక అంగీకరించగా అవి రెండూ కలసి ఆ పొలము వద్దకు వెళ్ళాయి. ఆ రోజు జింక తనివితీరా కావలసినన్ని మొక్కజొన్నలను తిన్నది. ఆ రోజు నుండి జింక ప్రతీ రోజు అదే పొలము వద్దకు వెళ్ళి తనకు కావలసినన్ని మొక్కజొన్నలను తినసాగింది. ఇది ఆ పొలము యజమాని గమనించి ఆ జింకను పట్టుకోవడానికి ఒక వలను సిద్ధము చేసాడు. ఎప్పటిలాగే జింక వచ్చి ఆ వలలో చిక్కుకొనిపోయింది.

నక్క ఆ సమీపములోనేయుండి ఈ విధముగా తలపోసింది. “నా లక్ష్యము నేటితో నెరవేరింది. కుటిల బుద్ధితో నా ప్రయత్నమును విజయవంతముగా సాధించగలిగాను. నేను ఎంతో కాలముగా ఎదురుచూసిన ఈ జింక మాంసమును తిని తృప్తి చెందుతాను. జింక తన నమ్మకపాత్రుడైన నక్కను చూసి ఎంతో సంతోషముతో, “ఓ ప్రియ నేస్తమా! నీవు సరైన సమయములో నా వద్దకు వచ్చినావు. నేను యిప్పుడు వలలో చిక్కుకొని యున్నాను. నా ప్రాణములకు హాని పొంచి యున్నది. నీవు వెంటనే యీ వలకు వున్న త్రాళ్ళను కొరికి నన్ను బంధవిముక్తుడిని చేయి”. దానికి బదులుగా నక్క, ‘అయ్యో! ఈ రోజు ఆదివారము గనుక నేను నా పంటితో వలను తాకలేను. నన్ను అపార్థము చేసుకొనవద్దు. ఈ రోజు గడవనిమ్ము. రేపు ఉదయము నేను చేసే పనులు నిన్ను విడిపించడముతోనే మొదలవుతాయి. దిగులు వద్దు’ అని చెప్పి ఆ నక్క పొలములోని ఒక మూలకు వెళ్ళి జింకకు కనబడకుండా పొదలమాటున నక్కి యున్నది.

సాయంకాలమయినా జింక రాకపోయేటప్పటికి కాకి దానికోసమై వెదుకుతూ చివరిగా జింకను పొలములోని వలలో చిక్కుకొని వుండడము చూసింది. అప్పుడు కాకి యిదంతయూ నక్క పన్నాగమని తెలుసుకొని జింకతో ‘ఆ ద్రోహి ఎక్కడ?’ అని అడిగింది. అంత జింక నా మాంసమును తినడానికి యిక్కడే ఎక్కడో వేచి యున్నాడు. కాకి నేను ముందుగానే నిన్ను హెచ్చరించాను. ఇప్పుడు వగచి ప్రయోజనమేమున్నది? నేను నీ విడుదలకు ఒక మార్గము చెబుతాను. రేపటి వుదయము యీ పొలము యజమాని యిచటకు వస్తాడు. అపుడు నీవు క్రింద పడుకుని చచ్చిన శవమువలె నటించుము. అపుడు నిజముగానే నీవు చనిపోయినావని తలచి యజమాని వలకట్టు నుండి నిన్ను విడుదల చేస్తాడు. కావు కావు మని అరచినవెంటనే నీవు ఒక్కసారిగా లేచి పరిగెత్తగలిగినంత వేగముగా పారిపొమ్ము. జింక తన అంగీకారమును తెలిపి, మర్నాడు రైతు వలను తీయగానే కాకి అరుపు విని శర వేగముతో పరుగుతీసింది. ఈ విధముగా జింక తన నమ్మకస్థుడైన మిత్రుని సహాయముతో ప్రాణములను నిలబెట్టుకొన్నది. రైతు జింక పరిగెత్తడము చూసి దానిపైకి తన దండమును విసిరాడు. అది అనుకోకుండా మాటున యున్న నక్కకు తగిలి అది చనిపోయింది.

నేటి ప్రపంచంలో ఎంతో మంది పైన చెప్పిన నక్క, జింక వంటి వారు మనకు తారస పడుతూవుంటారు. నక్క వంటి జిత్తులమారితనము కలవారు తమ చేతల ఫలితంగా నాశనమును కొని తెచ్చుకుంటారు. జింక వంటి వారు మందబుద్ధులుగాను అవివేకులుగాను వుంటూ అబద్ధమును నిజమని నమ్మి చెడిపోతారు. వారు పెద్దల సలహాను పట్టించుకోరు.

ఆధ్యాత్మిక మార్గమును అనుసరించేవారికి గురువు పట్ల అచంచలమైన విశ్వాసము కలిగి వుండడము అత్యావశ్యకము. సాధకులను మాయ అనేక విధములుగా ప్రలోభమునకు గురి చేస్తూ వుంటుంది. ఈ అనిత్యమైన ప్రలోభములకు వశము కాకూడదు. లేనట్లైతే అవి మిమ్ములను అపాయములోనికి నెట్టి వేయడమే కాక మీ వినాశనమునకు కూడా దారి తీస్తాయి. మీ సాధన బూడిదలో పోసిన పన్నీరు అవుతుంది.

మీ గురువు పట్ల విశ్వాసమును, భక్తిప్రపత్తులను కలిగి యుండండి. అణకువతో వారి ఆదేశమును నిర్వర్తించండి. అపుడు మీరు ఒకవేళ ఎన్నడైనా మాయ అనే వుచ్చులో పడితే గురువే మిమ్ములను రక్షించగలరు.

మీరందరూ మాయ యొక్క ప్రభావమును పూర్తిగా ఆకళింపు చేసుకొని, గురువు ఆదేశించిన మార్గములో పయనించి జనన మరణములనే చక్రవ్యూహము నుండి విడుదల చెందెదరుగాక!

- జ్ఞానయోగము చాల కఠినమైనది. దేహాత్మబుద్ధి వదలనిచో జ్ఞానము కలుగదు సుమా! కలియుగమున జీవులు అన్నగతప్రాణులు. దేహాత్మ బుద్ధి, అహంబుద్ధి పోదు. అందుచే కలియుగమునకు తగినది భక్తి యోగమే। భక్తి యోగము సులభమగు మార్గము. అంతరంగమున వ్యాకుల చిత్తము తోడు భగవంతుని నామగుణగానము చేయుము. వానిని ప్రార్ధన చేయుము. భగవద్దర్శనము ఖచ్చితముగా పొందగలవు. సందేహములేదు.

  – శ్రీ రామకృష్ణ పరమహంస

- విధి వశము అనునది బలీయమైనది. దానిని తప్పించనెవరి తరముగాదు. కాని భగవంతుని స్మరణ యొక్కటే తరుణోపాయము. కనుక అజ్ఞానులైనను, జ్ఞానులైనను విధికి వశులై, అంతయు నీయిష్టమే నెరవేర నిమ్ము, నాయిష్ట మేమియును లేదు, అని పూర్ణ శరణాగతులు కావలెను. అట్టి వారిని విధి ఏమియు చేయజాలదు.

  – స్వామి ఓంకార్

# జీవితము యొక్క విలువ

స్వామి ఓంకార్

## హరిజేరుమనే తండ్రి నిజమైన తండ్రి

దుర్లభమైన మానవజన్మ యొక్క అధిక్యమును, విలువను గ్రహించిన వారే కాలము యొక్క విలువను గూడ గ్రహించగలరు. నా కాలము చాలా విలువైనదని తరచుగా విలువైన కాలమును మాటలతో వ్యర్థము చేయుచున్న వారితో జెప్పుచుందును. నా కాలమే అననేల, మీకాలము మాత్రము విలువైనది కాదా?

నా వద్దనున్న సీతారం అనెడి పిల్లి పిల్లను జూచిన అది గంటల కొలది అటులనే నిద్రించుచుండ, దానికి కాలము యొక్క విలువ తెలియదు గదాయని తరచు దానిని చూచినప్పుడు నాకు తోచుచుండును. జంతు జాలమునకు కాలము యొక్క విలువ తెలియకున్నను పూర్వ జన్మ సుకృతముచే మానవజన్మను పొందిన మానవులకైనను, కాలము యొక్క విలువ తెలియకుండ క్షణములు, నిముషములే గాక రోజులు, వారములు, నెలలు, సంవత్సరములు గూడ వ్యర్థమైన ఆలోచనలతో నిరుపయోగమైన మాటలతో వ్యర్థమగుచుండుట చాలా విచారకరమైన, విషాదకరమైన అంశముగదా!

ఈ మధ్యను కొందరు స్త్రీలు విలువైన వస్తువులతో తమ్మలంకరించుకొని ఆశ్రమమునకు వచ్చిరి. మీరు ప్రార్థన చేయుచుంటిరా యని యడుగగా వారు లేదనిరి. వారి ఒడిలోనున్న పిల్లల అవస్థను, భావిస్థితిని ఆలోచించగా నాకు చింతగలిగెను. తండ్రీ! హరి జేరుమనియెడి తండ్రి, తండ్రి. యని భాగవతము జెప్పుచున్నది. దైవ సన్నిధిని జేర్చెడివారే నిజమైన తల్లితండ్రులు తాము ప్రేమించెడి తమ పిల్లల గురించియైనను తాము ప్రార్థన జేయుచు, తమ పిల్లలచే ప్రార్థన చేయించవలసిన బాధ్యత తల్లిదండ్రులకు లేదా? నోరులేని మూగజంతువులు ప్రార్థన చేయుటలేదనిన ఆశ్చర్యములేదు. నోరు గలిగి యుండియు అన్ని జన్మలలో నుత్తమమైన నరజన్మను పొందిన మానవులు గూడ ప్రార్థన చేయుట లేదనిన అట్టివారిని ఏమి అనవలెను?

అట్టివారినే రెండుకాళ్ళ జంతువులని విజ్ఞులు నుడివియుండిరి. అమూల్యమైన నరజన్మను పొందియు ప్రార్థన ధ్యానములు చేయని నరులు గమ్యస్థానమును మరచి విలువైన జీవితమును, కాలమును, జంతువుల వలె వ్యర్థముచేయరాదు. ఇట్టి వారిని గురించియే భాగవతములో చక్కనైన ఈ క్రింది పద్యము చెప్పబడెను.

చేతులారంగ శివుని పూజింపడేని
నోరు నొవ్వంగ హరికీర్తినుడువడేని

దయయు సత్యంబులోనుగాదలపడేని
కలుగ నేటికి దల్లుల కడుపుచేటు

క్షణములను వ్యర్థము చేయువారు జీవితమునంతను వ్యర్థము చేయుదురు అని మన ఆశ్రమములో చాలాచోట్ల వ్రాయబడియున్నది.

ఈ చిన్న వాక్యములో నెంత గంభీరమైన భావము గలదు! ఇట్టి మహావాక్యములను సదా చదివిన, స్మరించిన ధ్యానించిన కొంత ఉపయోగము కలుగును. కాలము యొక్క విలువ కూడా గ్రహింపనగును.

జరిగిన దానికి విచారించిన లాభములేదు. ఇదివరకు వ్యర్థబుచ్చిన కాలము మనమెంత విచారించినను మరలరాదు. ప్రస్తుతము అమూల్యమైన క్షణములను వ్యర్థబుచ్చకుండ సద్వినియోగము చేయుడు. ఒలికి పోయిన పాలకై విచారింపక, ఇకముందైనను పాల నొలికి పోకుండ కాలము వ్యర్థము కాకుండ సదా యెన్ని పనులలో నున్నను దైవనామ స్మరణను జేయుచు దినదినాభివృద్ధిని గాంచుచు దీపము ఆరిపోకుండగనే తరించుటకు అహర్నిశములు ప్రయత్నము చేయవలెను.

“నేడే మనది. రేపు మనదికాదు” అని మరియొక మహావాక్యము ఆశ్రమములో వ్రాయబడియున్నది. నేడు మనది అని యెటుల చెప్పగలము? ఏ క్షణమున నేమి జరుగనున్నదో మనము చెప్పజాలము గదా! మృత్యువు, మనతో చెప్పియైనను రాదుగదా!

కాన ఈ క్షణమే మనదని చెప్పవలెను. మానవుని పుణ్యపాపములు మాత్రమతడు చనిపోయిన నతనిని వెంబడించును. కొదువ ఆస్తులన్నింటిని, వస్తువాహనములన్నింటిని, సిరిసంపదలన్నింటిని నిచ్చటనే అనగా ఈ లోకము నందే యెచ్చటనున్న వాని నచ్చటనే వదలిపెట్టవలసి యుండును. ఎంత లుబ్ధుడైనను మొనబోయిన గుండుసూదినైనను, మొలనున్న తన మొలత్రాటినైనను తనవెంట తీసికొని పోజాలడు. అట్టి స్థితిలో తెలివిగల స్త్రీపురుషాదులందరును అతి ఉత్కృష్టమైన తమ మానవజన్మ యొక్క ఆధిక్యమును గ్రహించి, ఏదినిత్యమో, సత్యమో, శాశ్వతమో, దేనిని తమ వెంట దీసికొని వెళ్ళగలరో, ఏది శరీరము విడచినను తమవెంట ననుసరించునో అద్దానినే, దైవనామామృతమునే నిరంతరము, ప్రార్థన ధ్యానాదులు చేయుచు, గ్రోలుచుండవలెను.

గృహస్థులైనవారు తాము తరించి, తాము ప్రేమించెడి తమ బంధువులు, తమ పిల్లలు, అందరు తరించుటకు తోడ్పడుచుండవలెను.

ఈ శరీరములు యితరుల సేవకొరకే యివ్వబడెనని శాస్త్రములు "పరోపకారార్థ మిదం శరీరం" అనువాక్యములో చెప్పుచున్నవి. కాన మనము చేయవలసిన సేవను, ఉపకారమును, మంచిని నేడేచేసి మనము తరించి, మనవారందరకు, మన స్నేహితులకు శక్తి కొలది తోడ్పడుచు మనము, వారు అందరు తరించుటకై ప్రయత్నింపవలెను.

భక్తులైనవారికి, దైవపరితాపముతో నిండియున్నవారికి ఒక చిన్నమాట చాలుననియు, దైవచింతనలేని భక్తిహీనులకు కోటి మాటలు చెప్పినను నిరుపయోగమని పెద్దలు చెప్పియుండిరి. మీరందరు భక్తులు గాన, ఈ బోధలను ఒక చెవిలో ప్రవేశించినవాటిని మఱియొక చెవిద్వారా బయటకు పోనీయకుండగా మీ హృదయములను శాంతితో, దైవప్రేమతో నింపుకొని ఎన్నిపనులలో నున్నను నిరంతరము దైవనామస్మరణజేయుచు తరించగోరెదను.

వెఱ్ఱిమానవులు తలచుచున్నట్లు పనులెప్పుడును దైవనామస్మరణకు అడ్డురావు. ఒక భక్తవరేణ్యుడు ఒక చెయ్యి పనిచేయుచున్న రెండవ చేతితో దైవసేవ చేయమని చెప్పెను. రెండు చేతులును పనిచేయుచున్న నోటితో దైవ నామమును స్మరింపవచ్చును. రెండు చేతులకు పనిలేనప్పుడు, చేతులతో, నోటితో, మనస్సుతో, హృదయముతో నూరుపాళ్ళు మనస్సుతో దైవ ధ్యానము జేయుచు తరింపవచ్చును గదా! దైవ పరితాపము గలిగిన వారికి మోక్షము అరచేతిలోనే – చెంతనే – తమలోనే యున్నది. ఇక దైవపరితాపము లేని వారికో – అట్టి వారికి యీ జన్మలోనే గాక, కోటి జన్మములెత్తినను మోక్షము దూరముగనేయుండును. ఈ వ్యాసము వ్రాయుచుండ "దొరకదురా యీ నరజన్మ" అని యొక భక్తుడు చెప్పిన కీర్తన జ్ఞప్తికి వచ్చుచున్నది.

ఉత్తమమైన యీ నరజన్మమును స్వార్థముతో నింపి దుర్వినియోగము జేసిన మరల నరజన్మ యెటులదొరకును? కాన 'దొరకదురా నరజన్మ మరల' నని దైవభక్తులు కీర్తించుచున్నారు. బొందిలో ప్రాణముండగనే మనము చేయవలసిన ఉపకారమంతయు, సేవనంతయు, మనవారికి, మన సన్నిహితులకే గాక వారు వీరనక దగ్గర వారికి దూరమువారికి అందరకును సేవచేయుచు మీరందరును తరించెదరుగాక! నేడీవ్యాసమును చదివిన జ్ఞాపకార్థముగా శాంతి ప్రార్థనను వల్లించి సదా స్మరించుచు తరించుడు.

దైవము మీ అందరిని ఆయురారోగ్యములతో నిరంతరము బ్రోచుగాక!
లోకాస్సమస్తాస్సుఖినోభవన్తు హరిః ఓం తత్సత్

# శ్రీ తులసీ సర్వస్వము

జి.వి.ఎస్. సుబ్రహ్మణ్యశర్మ

## తులసీ వివాహము

## జీవబ్రహ్మల ఐక్యతయే కల్యాణము

శ్లో॥ ఆదావేవ2వనే2వాప్య తులసీం స్వగృహే2పివా।
వర్షత్రయేణ పూర్ణేన తతో యజన మారభేత్ ॥
సౌమ్యాయనే ప్రకర్తవ్యం గురు శుక్రోదయే తథా ।
అథవా కార్తికే మాసి భీష్మపంచదినేషుచ ॥
వైవాహికేషు ఋక్షేషు పూర్ణిమాయాం విశేషతః
మండపం కారయే త్తత్ర కుండవేదీం యథా పునః ॥
శాంతికంచ ప్రకర్తవ్యం మాతృణాం స్థాపనం తథా ।
మాతృశ్రాద్ధాదికం సర్వం వివాహవత్ సమాచరేత్ ॥ (విష్ణుయామళము)

తులసి విష్ణుప్రియ కనుకను, శంఖచూడుని భార్యయైనను జీవిత చరమదశలో విష్ణువుతో సంబంధమేర్పడుటవలనను, గండకీ నది, సాలగ్రామశిలల అవినాభావ సంబంధము వలనను, శ్రీ మహా విష్ణువునకును తులసికిని సన్నిహిత సంబంధము ఏర్పడినట్లు తులసీ చరిత్రము నందు తెలిసికొంటిమి కదా! ఆ సంబంధమును పురస్కరించుకొనియే కొందరు తక్కిన దేవతలతో పాటు తులసీ శ్రీమహావిష్ణువుల కళ్యాణ మహోత్సవమును వైభవముగా జరిపించుచుందురు. ఈ తులసీ కళ్యాణ వివరములు “విష్ణుయామళము అను గ్రంథమునందు పై శ్లోకములలో వివరింపబడినది. తులసీ కళ్యాణమును చేయదలచుకున్నవారు ముందుగా ఒక వనమునందు కాని, తమ ఇంటి యందు కాని, తులసి మొక్కను నాటవలెను. ఆ మొక్కకు మూడు సంవత్సరముల వయసు వచ్చిన తరువాత ఇక శ్రీ తులసీ కళ్యాణోత్సవమును ప్రారంభింపవలెను.

ఈ కళ్యాణమును 1. ఉత్తరాయణ కాలమునందు గాని, 2. గురు గ్రహోదయ కాలమునందు గాని, 3. శుక్రగ్రహోదయ కాలము నందు గాని 4. లేదా కార్తీక మాసము నందు గాని, 5 భీష్మ ఏకాదశి నుండి తరువాత వచ్చు ఐదు రోజులలో గాని నిర్వహించవలెను. అట్లే 6. వివాహమునకు పనికి వచ్చు శుభనక్షత్రములందు గాని 7. ప్రత్యేకించి పూర్ణిమ పర్వదినము నందు గాని ఈ కళ్యాణమును చేయవచ్చును.

కళ్యాణమును నిర్వర్తింపదలచిన ప్రదేశము నందు ముందుగా ఒక మండపమును నిర్మింపవలెను. ఆ మండపముమీదనే ఒక యజ్ఞ కుండమును కూడ నిర్మింపవలెను. ఆ

మండపము మీదనే ఒక యజ్ఞ కుండమును కూడా నిర్మింపవలెను. ఆ కళ్యాణ వేదిక పై ముందుగా శాంతి కర్మను, మాతృకా స్థాపమును చేయవలెను. వివాహము చేయునంతటి వైభవముగా ఆ వేదికపై మాతృశ్రాద్ధాదికములను నిర్వర్తించి, ఆ తరువాత తులసీ దేవిని కన్యగను (వధువు) శ్రీ మహా విష్ణువును వరుడుగను చేసి, భక్తి శ్రద్ధలతో యథాశాస్త్రముగా కళ్యాణమును జరిపింపవలెను. తీర్థ ప్రసాదములను పంచవలెను.

సాంప్రదాయసిద్ధముగా విష్ణువుతో, తులసికి వివాహము చేయవలెను. ఈ కళ్యాణమును చేయించిన వారికిని, చేసిన వారికిని, చూచిన వారికిని కూడ ఆ తులసీ నారాయణులు సర్వశుభమలను సర్వాభీష్టములను, సమకూర్చుచుందురు.

- ఒకడెంతపాపి అయినను నేను పాపినే, నేను ఎటుల కడతేరగలను. అని ఎక్కి ఎక్కి ఏడ్చుచునుండక నేను పాపిని అను తలంపు పారద్రోలి స్వరూపధ్యాన మందు ధృఢమైన పట్టుదల కలవాడై ఉన్నచో తప్పక అతడు నిశ్చయముగా బాగుపడి కడతేరును. లెక్కకు మీరి సముద్రపు అలలవలె విషయ చింతలు కల్గినను స్వరూప ధ్యానము పెరుగగా అవి అన్నియు తప్పక నశించును.

  – శ్రీ రమణ

- విజ్ఞానము, విచక్షణా జ్ఞానముతో నీ స్వేచ్ఛను నీవు నిలబెట్టుకో. నీ న్యాయ నిర్ణేతవు నీవే. తప్పు పనులు చేశావా నిన్ను నీవే శిక్షించుకుంటావు. మంచి పనులు చేశావా నీ స్వేచ్ఛను నీవే కాపాడుకుంటావు. కర్మ సిద్ధాంతము యొక్క న్యాయమది. దేవుడుకాని, దేవదూతలు కాని నిన్ను నిర్ధేశించుటలేదు. కర్మ సిద్ధాంతమే శాసిస్తుంది. ఏ విత్తనం పాతుతావో ఆ ఫలితమే వస్తుంది. క్రమశిక్షణలో ఇష్టా ఇష్టాలను జయించు.

  – శ్రీ పరమహంస యోగానంద

## అదిగో అధిగమిస్తాను

**ఒంటరిగా గాలిపీలిస్తూ**
**ఒంటరితనాన్ని అనుభవిస్తూ**
**ఒంటరిగా సేవిస్తూ**
**ఒంటరిగా సత్యాన్వేషణ చేస్తూ**
**ఒంటరిగా ఉధృతాన్ని అధిగమిస్తాను.**

**ఎమ్.ఎస్. రంగారావు (బన్ను)**
**9908484132**

# సంన్యాసము

వి. శారద

## సమాజాన్ని ధర్మపథంలో నడుపుటకు పరిశ్రమించుట

హిందూ సనాతన ధర్మంలో పుట్టిన ప్రతీప్రాణి తన జీవన విధానాన్ని ఏ విధంగా సాగించి, తన గమ్యమైన జన్మరాహిత్యాన్ని పొంది ముక్తిని అందుకోవాలో వివరించబడింది. జన్మించిన ప్రతీజీవి తన జీవన ప్రస్థానంలో నాలుగుదశలు చూస్తుంది. ప్రతీవారికి నాలుగు ఆశ్రమాలు తప్పనిసరి. ఊహవచ్చిన ప్రతీప్రాణి ఏదోఒక విద్యార్థి జీవితం ప్రారంభిస్తుంది. బ్రహ్మచారిగా విద్యాభ్యాసం పూర్తవగానే గృహస్థాశ్రమంలోకి అడుగు పెడతాడు. బ్రహ్మచారులు, వానప్రస్థులు, సంన్యాసులు గృహస్థునుండే పోషణ పొందుతారు. కాబట్టి గృహస్థాశ్రమమే శ్రేష్ఠమని విజ్ఞులు అంటారు. గృహస్థు తన తల నెరసిన తరువాత, చర్మము ముడతలు పడ్డాక, కుమారునికి పుత్రుడు కలుగగానే భార్యతో గాని లేక భార్యను పుత్రుని వద్ద వదలిగాని వాన ప్రస్థానమునకు చేరుకోవాలి. వాన ప్రస్థము అంటే వనము నందు నివసించడం. మనము ఆచరించే ఆశ్రమములో సంన్యాస ఆశ్రమము చివరిగా వుడడం వలన సహజంగా వృద్ధాప్యములోనే ఆ ఆశ్రమం స్వీకరిస్తాము. పురుషుడు తన డెబ్బది ఐదవయేట సంన్యాసి కావాలి.

మన నిత్యజీవితములో పలురకాల సంన్యాసులను చూస్తూ వుంటాము. వారిలో పలురకాలు వున్నారు. 1. వివిదిశ సంన్యాసము 2. విద్వత్ సంన్యాసము. వివిదిశ సంన్యాసమనగా దేహ భ్రాంతి తొలగిన తరువాత వచ్చు విమోచనము. వీరు విదేహముక్తులు. విద్వత్ సంన్యాసమనగా ఈ జన్మలోనే ముక్తిని పొందిన వారు. వీరిని జీవన్ముక్తులంటారు. లౌకిక సంబంధాల మీద సంపూర్ణ ఆసక్తి తొలగినవారు వెంటనే ఆ సంబంధాలను త్యజిస్తారు. లౌకిక సంబంధాల మీద ఆసక్తి పోవడమే విరక్తి. విరక్తి పలురకాలు. ధన దారాపుత్రుల నష్టంతో వచ్చే విరక్తి. ఇది తాత్కాలికం. సంపదలు, భార్యాబిడ్డలు వద్దు అనుకునే వివేకము. ఒక రకమైన విరక్తి. ఇవి తీవ్రమైన విరక్తులు. ఈ జనన మరణ చక్రంలో భ్రమించే ఈ ప్రపంచం నాది కాదు అనుకునేది తీవ్రతరమైన విరక్తి.

ప్రథమ స్థాయిలో తీవ్రవిరక్తి మనుష్యుణ్ణి **కుటీచక** సంన్యాసిగా మారుస్తుంది. వీరు పర్ణశాలలో గాని, ఋష్యాశ్రమాలలో గాని ఏకాంత వాసం చేస్తూ వుంటారు. వీరి సాధన స్థాయి పెరిగిన తరువాత బహూదకుడు అవుతాడు. **బహూదకులు** ఒక పవిత్రస్థలం నుండి మరియొక పవిత్ర స్థలమునకు తిరుగుతూ వుంటారు. వీరిని పరివ్రాజకులు అనికూడ అంటారు. వీరికి పిలకలుంటాయి. తీర్థయాత్రలు చేస్తూ వుంటారు. కుటీచక, బహూదకులు **త్రిదండులు**, త్రిదండం అనగా మూడు వెదురు కర్రలు కలిపి కట్టినది. ఈ త్రిదండము చివర వారి సాంప్రదాయ గుర్తు కలిగిన పతాకం వుంటుంది. దీనిని ధరించడంలో అర్థం, తాము భౌతిక, మానసిక, వాచక సంబంధించిన ప్రతీదానిని త్యజించామని, వీటికి ఆవల వున్న ఆ బ్రహ్మములోనే మునిగి వున్నామని తెలియజేయడం. త్రిదండి యొక్క ఆసాధన తీవ్రమైన కొలది అతని మనస్సు మానస సరోవరంలోని హంసవలె తన హృదయ సరోవరంలోనే తిరుగుతూ వుంటుంది. ఇతను భౌతిక ప్రపంచానికి దూరమవుతాడు. తామసము నుండి సాత్వికమునకు తనలోని చైతన్యము ఎదుగుతుంది. తనలోని జడత్వము వదలి సమాధిలో శుద్ధ చైతన్యాన్ని పొందేలా ప్రయాణిస్తూవుంటారు. ఈ స్థాయిలో వున్నవారిని **హంసలు**

అంటారు. జీవించి వుండగానే ఆత్మసాత్క్షారము పొంది, ఈ ప్రపంచములో తిరుగుతూనే దీనితో సంపర్కము లేని వారిని **పరమహంసలు** అంటారు. వీరు జీవన్ముక్తులు. వీరు సంన్యాసులలో ప్రథమ వర్గము వారు. వీరు పరమ సత్యాన్ని గ్రహించి ఎల్లప్పుడూ ఆ ఎరుకలోనే వుంటారు. వీరు ఐదేళ్ళ పసివారి వలె ప్రవర్తిస్తూ వుంటారు. వీరికి స్త్రీ పురుష బేధం ఉండదు.

సంన్యాసి అనగా సమస్త భౌతిక, సమస్త ఐంద్రిక జీవితాన్ని సంపూర్ణంగా పరిత్యజిస్తాడు. **సమ్యక్ – న్యస్యతే – ఇతి సంన్యాసి** బాగుగా అన్నిటిని వదిలిపెట్టిన వారు. జ్ఞానాన్వేషణకు, సత్యాన్వేసణకు అవసరమైన అధ్యయనం సాగిస్తాడు. తపస్సు, ధ్యానం ప్రారంభిస్తాడు. వైరాగ్యము కలిగిన దినమందే (బ్రహ్మచర్యము నుండియే కావచ్చును.) ఇంటి నుండి కాని, వనము నుండి గాని (వానప్రస్థుడు) సంన్యాసము గ్రహించుట మొదటి సంన్యాస క్రమము. వాన ప్రస్థము చేయకయే **గృహస్థాశ్రమము నుండియే సంన్యాసము** గ్రహించుట రెండవ క్రమము పూర్ణ విద్వాంసుడు, విషయభోగేచ్ఛ వదలిన జితేంద్రియుడు, పరోపకార కాంక్ష కల పురుషుడు బ్రహ్మచర్యాశ్రమము నుండియే సంన్యాసము స్వీకరించుట మూడవ రకము.

సంన్యాసి అయిన వారు కొన్ని ధర్మాలను పాటించాలి. మార్గమున నడచునపుడు దిక్కులు చూడక, భూమిమీదే దృష్టి వుంచి నడువవలెను. ఎల్లప్పుడు వస్త్రముతో వడపోసిన నీటిని మాత్రమే త్రాగవలెను. ఎల్లవేళలా సత్యమునే చెప్పవలయును. మనసుతో ఆలోచించి సత్యమును గ్రహించి అసత్యమును విడువవలెను. ఉపదేశ, సంవాద సమయములలో ఎవరైనా తనపై కోపించినను ఆగ్రహించకుండా అతని శ్రేయస్సు కొరకే ఉపదేశింపవలయును. తన ఆత్మ యందు, పరమాత్మయందు స్థిరుడై, మద్యమాంసములు విడచి, కోరికలు లేనివాడై, లోకమున ధర్మమును, విద్యను అభివృద్ధి చేయుటకు ఉపదేశించుచూ తిరుగుచుండవలెను. కేశములు, గోళ్ళు, గడ్డము, మీసములు తీసివేయువలయును. పాత్ర, దండము, కాషాయాంబరములు ధరించి, జీవహింస చేయక తిరుగుచుండవలెను. ప్రతి దినము ప్రాణాయామము వలన అంతఃకరణమును, ఇంద్రియ దోషములను, ప్రత్యాహారము వలన సంగదోషములను, ధ్యానము వలన అసురగుణములను, హర్ష శోకాదులను, అజ్ఞానము మొదలగు దోషములను నశింపచేసుకొనవలెను. సర్వ ప్రాణుల యెడమిత్రత్వము, ఇంద్రియ విషయముల త్యాగము, వేదోక్త కర్మలు, అత్యుత్తమ తపస్సునాచరించుట వలన సంన్యాసులు మోక్షమును పొందగలరు. గృహస్థులకు అన్ని వ్యవహారములలో నిజమైన విధానమును తెలుపవలెను. సందేహములు పోగొట్టి సత్యధర్మ యుక్తముగా ప్రవర్తించునట్లు బోధిచవలయును.

మనదేశములో పురి, సరస్వతి, గిరి, భారతి, తీర్థ ఆనంద మొదలైనవి ముఖ్యసంన్యాస సాంప్రదాయములు. మనము ఎవరి వద్ద ఏ సాంప్రదాయములో సంన్యాసము స్వీకరిస్తామో ఆ పీఠ ప్రతిష్ఠాపకుల నామంతో మనల్ని వ్యవహరిస్తారు.

జడలు ధరించినా, ముడిపెట్టినా గుండు చేయించుకున్నా కాషాయం కట్టుకున్నా కొందరికి ఇవి కడుపు నింపుకునే వేషాలని జగద్గురు శంకరాచార్యుల వారే అన్నారు. తలలు బోడులైనా తలపులు బోడులా? అని వేమన గారు వెక్కిరించారు. ఎందువలన తీసుకున్న సంన్యాసం తీసుకున్న వారు తమ ధర్మాన్ని తప్పకుండా పాటించాలి. ధర్మచ్యుతి జరిగితే వారు సన్నాసులే అవుతారు. వారిని చూసి జనులు భ్రాంతి చెంది వంచితులవుతారు. కాబట్టి తస్మాత్ జాగ్రత్త – జాగ్రత్త – జాగ్రత్త.

శ్రీమతి జి.ఎన్.కె. కుమారి గారి సహకారంతో

# విలువలు

సిలువేరు సుదర్శన్

## శాంతి అనే ఆరోగ్యముతో శోభించాలి

దీపంలేని ఇల్లు నీరు లేని బావి వంటిది. వెలుగులేని బ్రతుకు సూర్యుడు లేని ఆకాశం లాంటిది. వ్యక్తిలో వెలుగు ప్రసరించాలి. కాంతి నిండాలి. అప్పుడే వ్యక్తి సుఖించగలడు. వ్యక్తులతో కూడిన సమాజం శోభించును. వ్యక్తి ఆనందంలో పండి పోవాలి యని ఆలోచించే వారు రెండు తెగలుగా కనిపిస్తున్నారు. 1. అలక్ష్యపరులు-అనగా బ్రతుకులో ఏ లక్ష్యం లేకుండా జీవితాన్ని సాగించేవారు. బ్రతుకు బ్రతకడానికి విలువలు , వ్యక్తిత్వము అవసరము లేదని భావిస్తారు వీరు. వీరిది స్వార్థ పూరితమైన బ్రతుకు. వీరికి మంచి, చెడులు పట్టవు. తాము ఆనందంగా బ్రతకాలని ఎన్నినేరాలైన చేస్తారు. మోసాలకు వెనుకాడరు. ద్రోహాలకు పాల్పడతారు.

రెండవ తెగవారు లక్ష్యపరులు. అనగా బ్రతుకులో ఏదో లక్ష్యాన్ని గమ్యంగా పెట్టుకొని దానిని సాధించేందుకు కృషిచేస్తారు. ఉదాత్తమైన భావాలు వీరిలో పుష్కలంగా ఉంటాయి. స్పందించే హృదయముండును. వీరు రాజకీయాలలో ఉండొచ్చు, సేవా సంస్థలలో కొనసాగవచ్చు లేదా ఆధ్యాత్మిక పంథాలో నడక సాగించవచ్చును.

మొదటి తెగవారైన అలక్ష్యపరులే ఈ సంఘంలో అధిక శాతములో యున్నారు. వీరికి వెలుగులు ఇచ్చే విలువలు అవసరమై యున్నవి. రెండవ తెగ వారైన లక్ష్య పరులకు విలువలతోనే వెలుగులొస్తాయని స్పష్టమైన అభిప్రాయం కలిగియుంటారు.

అలక్ష్యపరులకు విలువలు శూన్యం గనుక విలువలు గలవారు కారు. రెండవ వారైనా లక్ష్య పరులకు విలువలున్నాయి కనుకనే విలువల గూర్చి సంఘంలో ప్రసంగాలు ఇవ్వడము జరుగుచున్నది. మరి విలువల గూర్చి ప్రసంగించే ఈ లక్ష్యపరులు విలువలున్న వారేనా? ఇది నేటిసంఘ సమస్య.

విలువలను గూర్చి బోధించడం వేరు, విలువలుగా బ్రతకడం వేరు. నీతిని గూర్చి మాట్లాడే వారికి నీతి మంచిదని తెలుసు కాని నీతిగా బ్రతకడం తెలియదు. అభ్యుదయం విశిష్టమైనదని దానిని గూర్చి ప్రస్తావించే రాజకీయవేత్తలకు తెలుసు. ఈ భావాలతో నిండిన నాయకునికి ఆదర్శంగా జీవించడం చేతకాదు. సాధన శ్రేష్ఠమైనదని సాధకులకు తెలుసు, సాధన చేయడం సాధ్యం కాదు. మంచి యున్నది విశిష్ఠమైన విలువ తెలిసి మంచిగా జీవించలేక పోవడం దురదృష్టకరం. ఈ ద్వంద్వ ప్రవృత్తికి కారణమేమై యుండును?

నిజమే పలకాలి అనేది బాల్యము నుండి మనకు జీర్ణించుకుపోయిన విలువ. కానీ, నిజం మాట్లాడడం చేదుగా మారిపోయింది. నేను ఇంట్లో లేనని వచ్చిన వ్యక్తికి చెప్పు అని తండ్రి కుమారుడికి చెప్పినపుడు ఈ మాట ప్రభావం బిడ్డపై ఎలా ఉంటుంది? అదే తండ్రి మరొక సమయంలో నాయనా! నిజము పలకాలి అని బిడ్డకు చెప్పినప్పుడు ఆ పిల్లవాని

మనసు దేనిని నమ్మాల్సి వుంటుంది? దేనిని ఆచరణలో తీసుకురావాలి? ఈ పరిస్థితిని కొడుకు పెరుగుతూ ఎలా అర్థం చేసుకుంటాడో తెలుసా? నిజం పలుకుటమంచిదే కాని సాధ్యం కాదు.

అబద్ధం చెప్పకూడదు. అయినా బ్రతకడానికి చెప్పి తీరాలి. ఇది జరిగేది. విలువల యొక్క విశిష్టత వ్యక్తి ఆంతర్యంలో నిలచి వుంది. కాని జీర్ణం కాలేదు. సరిపెట్టుకొని, సర్దుకొని జీవించె అలవాటు వ్యక్తిని పెనవేసుకొని ఉన్నది. ఈ సర్దుబాటు కూడా విలువగా వ్యక్తి భావనలో నిలచి ఉంది. సత్యం పలకాలి అనేది విలువ. అవసరమైనప్పుడు అబద్ధం ఆడవచ్చు అనేది రెండవ విలువయై కూర్చుంది. ఈ రెండు ఒకే వ్యక్తిలో కాపురం సాగిస్తున్నాయి. ఈ రెండింటిలో ఏదో ఒక్క దానినే నిలుపుకోవలసిన క్లిష్టపరిస్థితి దాపురించినపుడు వ్యక్తి ఏ విలువకు విలువనిస్తాడు? ఏ విలువను తేలికగా త్యజిస్తాడు?

వంటబట్టని తిండి వాంతియైనట్లు, జీర్ణము గాని విలువే త్యజింపబడుతుంది. నిజం త్రోసివేయబడి అబద్ధం తిష్టవేసుకొని కూర్చుంటుంది. అన్యాయాలు సేవజేస్తుంటాయి. అక్రమాలు అవసరాలు తీరుస్తుంటాయి. దౌర్జన్యాలు దగ్గరవుతాయి. దమనకాండలు కోకొల్లలవుతాయి.

నిజం పలికి నిలకడను కోల్పోయెకన్నా అబద్ధాలాడి అందలమెక్క వచ్చు. మంచిచేసి కుంచుకుపోయే కన్నా చెడు చేసి కులుకుతూ జీవించవచ్చు. విలువలు – విలువలు అని వేసారిపోయె కన్నా విలువలను కాలరాచి వ్యక్తి శోభించవచ్చు. చుట్టూ ఇవే జరుగుతున్నాయి. నేనూ వాటి చుట్టే తిరుగుతాను. ఇదే నేటి ప్రపంచంలో అవగాహన.

జీవితాన్ని సరిగా అర్థం చేసుకోలేకపోవడమే ఈదురవగాహనకు కారణం. తన ఆలోచనలకు ఆచరించే కర్మ ఫలితాలు ఎలా ఉంటాయో అర్థం గాని అయోమయ ధోరణియే ఈ దుశ్చింతనను కొనసాగిస్తున్నది. ఈ ప్రపంచములో ప్రతి వస్తువు మీద అశాశ్వతం అనెడి ముద్ర ఉన్నట్లు చూడలేక పోవడమే ఈ దురంతాలకు ఊపిరి అయి కూచుంది. అక్రమ మార్గాల్లో నడచి తాత్కాలికంగా ప్రేయస్సుననుభవించినా శాశ్వతముగా శ్రేయస్సు దూరమవుతున్నదని మానవుడు గ్రహించలేకున్నాడు. చెడుదారుల్లో చరించే వ్యక్తి కట్టుకున్న మేడలు, కులుకుతున్నా మార్గాలు కనిపిస్తున్నాయే గాని, ఆయన జీవితంలో ఎదురయ్యే సమస్యలు, నిలదీసే పరీక్షలు, జారిపోయే కాంతి, కృంగదీసే అశాంతి తెలిసి రావడం లేదు.

ప్రపంచం ఇలా ఉంది అని విమర్శించి సాధించేదేముండదు. నేనూ అలాగే పోవాలి అని ప్రపంచ బురదలో పడి కూరుకుపోయి సంగ్రహించేదసలే ఉండదు. ప్రపంచం నిర్విరామంగా బోధిస్తున్న పాఠాలను చక్కగా అధ్యయనం చేస్తే చాలు. నీవు చక్కని విద్యార్థినివి అయితే శాంతి నీదవుతుంది. సమస్యలను పరిష్కరించి, శాంతి నీ హక్కు అని చాటి చెప్తుతుంది.

క్షణిక సుఖాల కొరకు ప్రశస్తమైన మానవజన్మను వృధా చేసుకోకూడదు. అగ్నితో శుద్ధిపడిన బంగారు లాగా అధ్యయనంతో బంగారు బ్రతుకును తయారు కావించుకోవాలి.

జీవితంలో ఎన్ని కష్టాలైన ఎదురు కావచ్చును. కాని బ్రతుకును శోభాయమానంగా తీర్చిదిద్దుకునేందుకు మానవ జన్మయే ఏకైక పరిశోధనాలయము.

నిజమైన విలువలకు విలువకట్టడం నేర్చుకోవాలి. అప్పుడే జీవితంలో వెలుగులు విరజిమ్ముతాయి. బ్రతుకనేర్చిన సంఘంలో మనిషి క్షణక్షణానికి మరణిస్తాడు. బ్రతుకునేర్చిన సమాజంలో మనిషి అమృత స్వరూపుడవుతాడు

బ్రతికి తెలుసుకోలేని దౌర్భాగ్యం కన్నా తెలిసి బ్రతికే సౌభాగ్యమే శ్రేష్ఠమని గ్రహించాలి. విలువలు తెలిసి లాభం లేదు. అవి వంట బట్టాలి. శుద్ధమైన జ్ఞానమే ఆరోగ్యకరమైన వంట. ఆ వంట బట్టించే పనిని బ్రహ్మ సమాజసభ్యులు భుజానకెత్తుకోవాలి.

జ్ఞానమును ఆరగించాలి. ఆవేదనాకలిని పోగొట్టుకోవాలి. శాంతియనెడి ఆరోగ్యంతో శోభించాలి. ప్రపంచ శాంతి, సుస్థిరతకు ఇదియే ఏకైక మార్గం.

నిన్నటి స్వప్నం ఇప్పుడులేదు. అది గతం. రేపటి స్వప్నం ఇప్పుడు లేనే లేదు. అది భవిష్యత్తు. ఇప్పుడు కలలేదు. ఇది వర్తమానం. కలలు లేని కళ, జీవన కళ వర్తమానమే అనేది జీవికి దేవుడు పంపే వర్తమానం. గతించింది తిరిగిరాదు. వచ్చేది ఏదో వస్తే గాని తెలియదు. ఉన్నదే ఉన్నది. ఉనికియై యున్నది.

వీటినాకళింపు చేసుకొని సంఘంలో కల రుగ్మతను రూపుమాపడానికి ప్రయత్నించాలి. పెళ్ళిళ్ల పేరుతో దుబారా ఖర్చులను అరికట్టాలి. ఆకలి గొన్న వారిని ఆదుకోవాలి. అవినీతిని రూపుమాపాలి. వందల వేల కోట్లు ప్రోగుచేసుకొని విదేశాలకు పారిపోతున్నారు. ఈ దిశగా ప్రయత్నాలు ప్రతిఘటించడానికి కృషి చేయాలి. ధనార్జనే ముఖ్యమైన ఈ కాలంలో ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సంఘానికందించి మన వంతు ప్రయత్నాలు సాగించాలి. భాగ్యనగరంలో జరిగిన ఆంధ్ర బ్రహ్మ సమాజ 80వ వార్షిక మహోత్సవ వేళ సెమినార్-2లో పాల్గొని ప్రసంగించిన స్వీయ ఉపన్యాసము 10.3.2018న.

---

తలనొప్పితో బాధపడేవాడు సరైన మందు తీసుకోకపోతే, ఎలాగ విశ్రాంతిగా వుండలేడో అలాగే శాంతి, ఆరోగ్యం. మన స్వభావం కాని అనారోగ్యం కాదు. అలాగే శాంతి మన స్వభావం కాని అనారోగ్యం కాదు. అలాగే శాంతి మన స్వభావం – మనం నిశ్చయంగా శాంతి స్వరూపులం. అది విస్మరించి బైట నుంచి శాంతిని కోరుతున్నాం. అది అసాధ్యమైన అన్వేషణ. అదే నీకు ఈ రకమైన కష్టాల్ని కలిగిస్తోంది. బాహ్య విషయాల వస్తువుల నుంచి నీ మనస్సు వైదొలగినప్పుడు అంటే నీవు అంతర్ముఖుడవు అయిన క్షణాన నీవు శాంతిని పొంది, సుఖంగా వుంటావు.

**– శ్రీ రమణ మహర్షి**

# సేంద్రియ ఉత్పత్తులు

శ్రీమతి సత్యరాణి

## ప్రకృతి ఆరాధనయే నిజమైన ఆరాధన

పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం గో ఆధారిత వ్యవసాయం. దానిని అశ్రద్ధ చేసి రసాయన ఎరువులు క్రిమి సంహారక మందుల వాడకం వలన భూసారం క్షీణించి భూ భౌతిక లక్షణాలు దెబ్బతిన్నాయి. భూమి పొరలలో సహజ సిద్ధమైన ఎన్నో సూక్ష్మజీవులు నశించి దిగుబడులు తగ్గిపోతున్నాయి.

విదేశీ రసాయన ఎరువులు పొలాలలో వాడటం వలన కొద్ది కాలం పంటలు బాగానే పండుతున్నాయి. కాని కాలక్రమేణా కొన్ని సంవత్సరాలకు పంటలను పండించే శక్తిని కోల్పోయి నిస్సారమైపోతున్నాయి మన భూములు. పశ్చిమ దేశాలలో రసాయనిక ఎరువులు వాడకం వల్ల అమెరికా, యూరప్ మొదలగు దేశాలలో వేలాది ఎకరాల నేల బంజరుభూమిగా మారినట్లు పరిశోధనల వల్ల గుర్తించారు.

వాతావరణంలో కూడా మరెన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ వ్యవసాయ ఎరువులు వాడకం వలన భూమండలం పైన నైట్రస్ ఆక్సైడ్ పరిమాణం పెరుగుట వలన భూమి మీద ఉష్ణోగ్రత కూడా పెరుగుతూ ఉంది. వాతావరణంలో కాలుష్యం పెరిగి పర్యావరణానికి ముప్పుగా మారింది. ఆ పంటలను తింటున్న మానవాళి ఎన్నో దుష్ఫలితాలను అనుభవిస్తున్నది.

ఇలాంటి దుష్ప్రభావాల నుండి భూమి, మానవాళి ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు గో అధారిత వ్యవసాయమే ప్రత్యామ్నాయము.

ఒక్క ఆవుతో 30 ఎకరాల వ్యవసాయం చెయ్యవచ్చు అనే సూత్రం ద్వారా సేంద్రియ వ్యవసాయం రూపుదిద్దుకుంది. దేశీయ ఆవుల గోమూత్రం, గోమయంలో పంటలకు, చెట్లకు మేలు చేసే కోటానుకోట్ల బాక్టీరియా నిక్షిప్తమై ఉందని 1 గ్రాము దేశీ ఆవు పేడలో 3 వందల కోట్ల సూక్ష్మ జీవులు ఉన్నాయని శాస్త్రీయంగా రుజువైంది. దేశీయ ఆవుల సంఖ్య చాలా తక్కువగా ఉన్నది. ఈ నేపథ్యంలో వీటి పేడ, మూత్రంలోని బాక్టీరియా మరింత వేగవంతంగా పనిచేసేటందుకు శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనల ఫలితంగా సేంద్రియ ఉత్పత్తులు అందుబాటులోకి వచ్చాయి.

సహజంగా నేలలోపల జరిగే అనేక చర్యల వలన పోషకాలు ఉత్పత్తి అవుతూ ఉంటాయి. అయితే అవి మొక్కలకు అందుబాటులో ఉండవు. పంటలకు కావలసిన పోషకాలను నేల నుంచి లేదా వాతావరణం నుంచి గ్రహించి మొక్కలకు అందించే సూక్ష్మ జీవుల సముదాయాన్నే సేంద్రియ ఉత్పత్తులు అంటారు.

పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం, గో అధారిత వ్యవసాయమని రైతులు తెలుసుకున్నారు. ప్రకృతి సాగు ద్వారా సేంద్రియ పంటలను పండించాలన్న రైతుల ఆకాంక్ష సుభాష్ పాలేకర్, వ్యవసాయ సంబంధిత సిద్ధాంతాలను పాటిస్తే రైతులు తక్కువ ఖర్చుతో దేశీ ఆవుల గోమయము, గోమూత్రముతో గో అధారిత వ్యవసాయం చేస్తూ, అధిక నాణ్యమైన

దిగుబడులను పొందుతూ ఎక్కువ లాభాలను ఆర్జించవచ్చని నిరూపిస్తున్నారు. ఇదే గో అధారిత సాగుపై మళ్ళీ రైతులు మొగ్గు చూపడానికి దారి తీసింది.

దేశీ ఆవుల పేడ, మూత్రాలలో ఎన్నో ప్రయోజనాలున్నాయి. గోమయం క్రిమి సంహారకము. బహు ప్రయోజనకారి. ఇందులో 16 ఉపయోగకరములైన ఖనిజములు ఉన్నాయి. ఆవుపేడలో వ్యాధులను నిరోధించే శక్తి ఉంది. గోమూత్రం శక్తివంతమైన కీటకనాశిని. వీటిని ఒక కల్చర్ ద్వారా భూమికి అందించడం ద్వారా భూసారం పెరుగుతుంది. భూమిని, వాతావరణాన్ని సంరక్షిస్తూ అధిక దిగుబడిని పొందవచ్చు. దీనిలో అన్ని రకములైన స్థూల పోషకములతో పాటు సూక్ష్మ పోషకాలు ఉండడం విశేషం. బాక్టీరియా వల్ల భూసారం పెరుగుతుంది. వానపాముల సంఖ్య కూడా పెరుగుతుంది. భూమిలో సూక్ష్మ జీవులు, వానపాముల కదలిక వల్ల భూమి గుల్లబారి నీటిని నిలువ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. దీనిలో ఉండే పోషకాల వలన మొక్కల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుంది. మొక్కలు ఆరోగ్యంగా, దృఢంగా పెరుగుతాయి. దిగుబడి పెరగడంతో పాటు పంట బరువుతో పాటు పోషక విలువలు కూడా అనూహ్యంగా పెరుగుతాయి. దిగుబడి విలువ కూడా మామూలు వాటికంటే రెట్టింపు ధర వుంటుంది. 20% నీరు ఆదా అవుతుంది.

నీటిని రెండు విధాలుగా తయారు చేసుకోవచ్చు. అవి ఘన, ద్రవ, జీవామృతాలు. దీని తయారీ కూడా చాలా సులభం, సక్రమంగా తయారుచేసినప్పుడే దాని పూర్తి ఫలితాలు అందుతాయి.

జీవామృతం ద్వారా భూమిలో సూక్ష్మజీవులు, వానపాములు ఇబ్బడి ముబ్బడిగా వృద్ధి చెందుతాయి. మట్టిలో నిద్రాణమైన సూక్ష్మ జీవులను వానపాములను చైతన్యవంతం చేయడం ద్వారా జీవామృతం భూసారం పెరగడానికి దోహదపడుతుంది. భూమిలోని పోషకాలను చెట్లు నేరుగా వినియోగించుకునేలా మార్చి అందించడంలో ఆవు పేడ, ఆవు మూత్రం, పాత్ర అసాధారణమైనది. ఇవి భూమికి మేలు చేసే కోటాను కోట్ల జీవరాసులకు నిలయమైనవి. మొక్కల పెరుగుదలకు స్థూల సూక్ష్మ పోషకాలు అందుతాయి. చీడపీడలు రాకుండా చేస్తుంది. పొలం గుల్లబారడంతో పాటు పంట నాణ్యత ఉంటుంది. ఇది భూసారాన్ని సహజసిద్ధంగా పెంచుతుంది. పంటకు, చేనుకు బలాన్నిస్తుంది.

ఘనజీవామృతం :

దీనికి పేడ ప్రధానం. దీనిలో అనేక సూక్ష్మజీవులు దాగి ఉన్నాయి. వీటిని పెంచి పెద్ద చేసి అనతికాలంలోనే 24/48/72 గంటల కాల పరిమితిలో ఈ జీవాణువులు బాగా వృద్ధి పొందడానికి దీనిలో కొన్ని పదార్థాలను కలుపుకోవలసి వస్తుంది.

100 కేజీల దేశీ ఆవుపేడ, 2 కేజీల బెల్లం, 2 కేజీల పప్పులపిండి, 5 లీటర్ల ఆవు మూత్రం, గుప్పెడు పుట్టమట్టి, వీటన్నింటినీ బాగా కలిపి 3 రోజులు మురగనివ్వాలి. తరువాత 5 రోజులు చెట్ల నీడలో పలుచగా ఆరపెట్టాలి. రోజూ దాన్ని కలపాలి. బాగా ఆరిన తరువాత పొడిపొడిగా చేసుకొని సంచులతో నిలువ వుంచుకొని 6 నెలల వరకు దీనిని వాడుకోవచ్చు. ఎకరాకు 20 కేజీల వరకు వాడుకోవచ్చు. ఇది ఎరువుగానే కాక క్రిమి సంహారకంగా కూడా పనిచేస్తుంది.

**ద్రవ జీవామృతం :**

200 లీటర్ల డ్రమ్ములో 180 లీ. నీరు తీసుకొని 10 కేజీల ఆవు పేడ, 10 లీటర్ల ఆవు మూత్రం, 2 కేజీల బెల్లం, 2 కేజీల పప్పులపిండి, పిడికెడు పుట్టమట్టి వీటన్నిటిని నీటిలో వేసి బాగా కలియబెట్టాలి. 5 రోజులు బాగా మురగనివ్వాలి. ఉదయం సాయంత్రం దానిని బాగా కలపాలి. దీనిని 6,7 రోజుల వరకు వాడవచ్చు. ఎకరాకు 200 లీటర్లు చొప్పున నెలకు ఒకసారి వాడవచ్చు. నీరు పెట్టేటప్పుడు నీటితో కలిపి వాడాలి.

గమనిక : దేశీ ఆవుల గోమూత్రాన్ని గోమయాన్ని వాడాలి.

ఇది నిలువ వున్నది కాకుండా 1,2 రోజులదై ఉండాలి. అందులో సూక్ష్మజీవులు సజీవంగా శక్తివంతంగా ఉంటాయి.

పప్పుల పిండి : సోయా వేరుశనగ కాకుండా మిగిలిన ధాన్యాల పొడి వాడవచ్చు.

పుట్టమట్టి : రసాయనిక ఎరువులు మందులు కలపని మట్టినే వాడాలి. అందులో భూ సూక్ష్మజీవులు శక్తివంతంగా ఉంటాయి. గోమూత్రం, గోమయంలో మిగిలిన పదార్థాలు ఎందుకు కలుపుతారంటే కల్చర్‌ను వేగవంతము, సమర్థవంతముగా చేయడానికి.

గోమూత్రం శక్తివంతమైన కీటకనాశిని.

గోమూత్రంలో జిల్లేడు, వేప, తులసి ఆకులను నానబెట్టి ఎక్కువ నీటిలో కలిపి క్రిమిసంహారక మందులుగా చేసుకోవచ్చు.

వేప, వావిలి, జిల్లేడు, ఉమ్మెత్త, సీతాఫలం చెట్ల ఆకులతో కేజీకి 25 లీటర్ల ఆవు మూత్రం కలిపి 3 పొంగులు వచ్చేవరకు ఉడికించి ఆ ద్రవానికి నీరు కలిపి చెట్లపై పిచికారీ చేస్తే పంటలకు చీడపీడలుండవు.

గోమూత్రంలో అధికనీరు కలిపి పంటపొలాలపై చల్లితే క్రిమి సంహారికంగా పనిచేస్తుంది. ఒకలీటరు ఆవు మజ్జిగను ఒక వారం రోజుల వరకు మురగపెట్టి అందులో 500 లీటర్ల నీరు కలిపి పంట పొలాలపై పిచ్చికారి చేస్తే ఆ పొలం ఉత్పాదకత పెరుగుతుంది.

ఈ మిశ్రమం అర ఎకరం పైగా పొలానికి సరిపోతుంది. అట్టి భూమిలో పురుగు మందులు ఇతర విదేశీ ఔషధాలు వాడనక్కరలేదు.

ఈ సేంద్రియ ఉత్పత్తులను వాడితే భూమి సారవంతమౌతుంది. పంటను, పోషక పదార్థాలతో బరువును పెంచుతుంది. మొక్క పెరుగుదలకు స్థూల సూక్ష్మ పోషకాలు అందుతాయి. చీడపీడలు రాకుండా చేస్తుంది. ఆరోగ్యదాయకమైన పంటలు పండించుకోవచ్చు. 20% నీరు ఆదా అవుతుంది.

ఇదే మోతాదులో కొంచెంగా చేసుకొని పెరటిలోని మొక్కలకు కూడా వాడుకోవచ్చు. గోలాలలో మొక్కలకు ఎరువుగా వాడుకోవచ్చు. మరిన్ని వివరములకు సేంద్రియ ఉత్పత్తి కేంద్రాలను సంప్రదించగలరు.

ఇవి ఎందుకు వివరించామంటే ఆవు వట్టిపోయిందని దాన్ని కబేళాలకు, రోడ్ల మీదకు తరలించవద్దు. దాని మలమూత్రములతో దానికి కావలసిన ఆహారం కంటే ఎక్కువ సంపాదించి ఇవ్వగలదని తెలియజేయడానికి.

# నాకెందుకు వజ్రపుటుంగరం?

స్వామి చిన్మయానంద

## శ్రమలోనే జీవించాలి

ఒకప్పుడు ఒక సన్యాసి దట్టంగా చెట్లు పెరిగి ఉన్న ప్రదేశంలో తపశ్చర్యలు ఆచరిస్తూ వచ్చాడు.

ఇలా ఉండగా ఒకరోజు ఆ సన్యాసి సమీపంలో పారుతున్న ఏటిలో స్నానం చేసి నడిచి వస్తున్నాడు.

అప్పుడు దారిలో, ఆయన కూర్చుని ధ్యానం చేసే చోటుకు కాస్త దూరంలో, గడ్డినేల మీద ఒక వజ్రపుటుంగరం ధగధగా మెరిసిపోతూ పడి ఉండడం ఆయన కంటపడింది.

వజ్రపుటుంగరం ఆయనకు అక్కర్లేదు, దాని పట్ల ఆయనకు అనురక్తి లేదు. కాబట్టి ఆయన గడ్డి నేల మీద పడి ఉన్న ఆ వజ్రపుటుంగరాన్ని తీసుకోలేదు.

తరువాత ఆయన కళ్ళు మూసుకొని ధ్యానంలో నిమగ్నుడయ్యాడు.

కళ్ళు మూసుకున్న స్థితిలో ఆయనకు సమీపంలోని గడ్డి నేల మీద ఏదో శబ్దం వినిపించింది.

అప్పుడు ఆ సన్యాసి, 'ఎవరో వస్తున్నారు. ఆ వ్యక్తి ఆ వజ్రపుటుంగరాన్ని తీసుకోని అని అనుకున్నాడు.

అడుగుల చప్పుడు కాస్త దూరంలో వినరాగానే, వచ్చిన వ్యక్తి వెళ్ళిపోయాడు అనుకొని ఆ సన్యాసి కళ్ళు తెరచి చూశాడు.

చూడగా వెళ్ళినది మనిషి కాదు – అదొక పశువు!

ఈ విధంగా ఆ రోజు అడుగుల శబ్దం విన్నప్పుడల్లా ఆ సన్యాసి, ఎవరో వ్యక్తి వస్తున్నాడు... అతడు ఆ వజ్రపుటుంగరాన్ని తీసుకొని!' అని అనుకోసాగాడు.

అక్కణ్ణుండి ఆ వ్యక్తి వెళ్ళిపోయాడని శబ్దాన్ని బట్టి ఊహించి, వచ్చిన వ్యక్తి వజ్రపుటుంగరాన్ని తీసుకొన్నాడా? అని కళ్ళు తెరిచి చూశాడు.

ఆ అనుభవం ఆ సన్యాసికి మొదటి రోజు నాలుగైదుసార్లు కలిగింది. ఆ రోజు ఆ దారిలో వెళ్ళిన నలుగురైదుగురు వ్యక్తులూ వజ్రపుటుంగరాన్ని తీసుకోకుండానే తమ దారిన వెళ్ళిపోయారు.

రెండవరోజూ ఆ దారి గుండా వెళ్ళిన నలుగురైదుగురు వ్యక్తులు కూడా వజ్రపుటుంగరాన్ని తీసుకోకుండానే వెళ్ళిపోయారు.

మూడవరోజు సన్న్యాసి ఎవరో వ్యక్తి వస్తున్న అడుగుల శబ్దం విని కళ్ళు తెరిచి చూశాడు.

అప్పుడు వృద్ధుడైన ఒక రజకుడు వీపు మీద బట్టలమూటను మోసుకుంటూ రావడం సన్న్యాసికి కనిపించింది. అతడికి వృద్ధాప్యం కారణంగా గూని ఏర్పడింది. కాబట్టి అతడు వంగి నేలను చూస్తున్నట్లే నడిచి వస్తున్నాడు.

తన సమీపంలోకి వచ్చిన ఆ రజకునితో సన్న్యాసి, "అదుగో చూడండి! మీరు వస్తున్న దారిలో ఒక వజ్రపుటుంగరం! దాన్ని మీరు తీసుకోండి!" అని చెప్పాడు.

అందుకు ఆ వృద్ధుడైన రజకుడు, "నేను వస్తున్న దారిలో గత మూడు రోజులుగా ఆ వజ్రపుటుంగరాన్ని చూస్తూనే ఉన్నాను స్వామీ! నేను నా శ్రమతోనే జీవించాలని అభిలషిస్తున్నాను. శ్రమపడకుండా అయాచితంగా లభించే ఈ వజ్రపుటుంగరం నాకు అక్కర్లేదు. శ్రమించకుండా లభించేది ఏదీ నాకు అవసరం లేదు. నాకెందుకు వజ్రపుటుంగరం?" అని జవాబిచ్చాడు.

ఆ దారిలో కొందరు వ్యక్తులు వెళ్ళనే వెళ్ళారు. కాని వారిలో ఏ ఒక్కరూ ఈ వజ్రపుటుంగరాన్ని చూడకపోవడంతో దాన్ని తీసుకోలేదు. మూడురోజులుగా వజ్రపుటుంగరాన్ని చూస్తున్న ఆ రజకుడు, ఇతరులకు సొంతమైన ఏదీ నాకు అక్కర్లేదు. ఉచితంగా లభించేది ఏదీ నాకు వద్దు. నా శ్రమను నమ్ముకునే జీవిస్తాను అని అన్నాడు.

జనులు తమ శ్రమతోనే జీవితం గడపాలి. శ్రమించకుండా తిని కూర్చోవడం దొంగతనంతో సమానమని పై ఉదంతంలోని రజకుడు మనకు చెప్పక చెబుతున్నాడు.

- నీవేదైనా ఒక ప్రత్యేకమయిన కార్యమును సాధించదలచినప్పుడు సర్వశక్తిమంతుడైన దేవుడు నీ మనసు నందు, నీ ఆలోచనల యందు ప్రవహిస్తున్నట్లుగా గట్టి నమ్మకంతో ఉండు. తండ్రీ యీ పని నీవు చేస్తున్నావు. నేను గాదు. అని నమ్మకంతో పదే పదే చెప్పు. నమ్మకంతో దేవునితో కలిసివుండు.

– శ్రీ పరమహంస యోగానంద

- భగవన్నామస్మరణ ద్వారానే సకలం సిద్ధిస్తుంది. మనస్సు నిశ్చలంగా లేకున్నప్పటికీ ఒక చోట కూర్చుని పదిలక్షల సార్లు పావన నామాన్ని జపించు.

– శ్రీ శారదామాత

# విజ్ఞప్తి - గోసంతతికై గోశాల విస్తరణ

**నమోదేవ్యై మహాదేవ్యై సురభ్యై చ నమో నమః । గవాం బీజ స్వరూపాయై నమస్తే జగదంబికే॥**
**మహాదేవీ, గోబీజ స్వరూపిణి, జగదంబికా । సురభిమాతా, నీకు నమస్కరించు చున్నాను.**

ప్రేమమూర్తులైన, ఆశ్రమ భక్తులకు పూజ్య స్వామి ఓంకార్ మరియు మాతాజీ వారి యొక్క దివ్య ఆశీస్సులు.

మీ అందరి సహకార సంపత్తులతో, ఆశ్రమంలో తలపెట్టిన బృహత్ పథకం అయిన "గోశాల మరియు కృష్ణమందిరం నిర్మాణం", విజయవంతంగా పూర్తి అయ్యి మార్చి నెలలో పూజ్య మాతాజీ దివ్య హస్తములతో ఘనంగా ప్రారంభమయిన విషయం మీ అందరికీ ఇదివరలో పత్రికా ముఖంగా తెలియపరచడమైనది.

ఈ గోశాల నిర్మాణం వలన గోవులు, లేగదూడలు ఎంతో సౌకర్యంగా, ఆరోగ్యకరంగా ఉంటున్నాయని తెలుపుటకు చాలా ఆనందంగా వుంది. ఇందుకు గాను సహకరించిన సహృదయులు అయిన భక్తులు అందరికీ మరొక్కసారి కృతజ్ఞతలు మరియు ఆశీస్సులు.

గత సంవత్సర కాలంగా సంఖ్యాపరంగా పెరిగిన లేగదూడలు ఉండుటకు, సేద తీరి పచ్చిక మేయుటకు, వాటికి ప్రత్యేకంగా, కొంత విశాల ఆవరణతో కూడిన చిన్న షెడ్ నిర్మాణం అవశ్యం అనిపించింది.

ఈ ప్రతిపాదనలో, 100' × 50' అడుగుల కొలతలు గలిగి, ప్రహరి గోడ, గేటుతో కూడిన ఒక విశాల ఆవరణ, అందులో 20'×40' సైజు గల, ఒక రేకుల షెడ్ మరియు చిన్న నీటి తొట్టి నిర్మించాలని తలపెట్టడం అయ్యింది.

ఈ ప్రతిపాదనకు సుమారుగా రూ.6.50 లక్షలు కాగలదని అంచనా వేయడం అయ్యింది.

ఈ బృహత్కర నిర్మాణంలో భాగస్వాములు కాదలచిన ఆశ్రమ భక్తులు, ఔత్సాహిక ఆశ్రమ భక్తులు, ఔత్సాహిక దాతలు విరాళములు ధనరూపంలో/చెక్కు/ ఎస్.బి.ఐ. కత్తిపూడి అకౌంట్ నెం. 11003309435కు ఆన్‌లైన్ ద్వారా శ్రీ శాంతి ఆశ్రమం పేరున పంపగలరని విజ్ఞప్తి. మీరు ఏ విధంగా విరాళము పంపినను వ్రాత పూర్వకముగా లేదా ఇమైల్ ద్వారా లేదా మొబైల్ నంబరు 7382009962కు మీ పేరు, చిరునామా మీ మొబైల్ నంబరు తెలుపగలరు. మీ విరాళములకు సెక్షన్ 80జి ప్రకారము ఆదాయపు పన్ను మినహాయింపు కలదు. రూ. 10,000/-కు పైన ఇచ్చిన దాతల పేర్లు శిలాఫలకము మీద వ్రాయబడును. ఈ బృహత్తర కార్యక్రమంలో వారి వారి శక్త్యానుసారము సహకరించవలసినదిగా మా విన్నపము.

ఓం తత్ సత్

గురుసేవలో
**వినమ్రానంద సరస్వతి**

# దాతలకు విజ్ఞప్తి

దివ్యాత్మ స్వరూపులకు సూచన. శ్రీ శాంతి ఆశ్రమమునకు విరాళము ధన రూపంలో / చెక్కు / ఎస్.బి.ఐ, కత్తిపూడి, అకౌంట్ నెం. 11003309435కు ఆన్‌లైన్ ద్వారా పంపగలరు. మీ విరాళములకు ఇన్‌కమ్‌ట్యాక్స్ 80జి రాయితీ కలదు. మీరు ఏ విధంగా విరాళము పంపినను వ్రాత పూర్వకంగా లేదా ఇమైయిల్ ద్వారా లేదా మొబైల్ నంబరు 7382009962కు మీ పేరు, చిరునామా మీ మొబైల్ నంబరు తెలుపగలరు.

# శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి

శాంతి పత్రిక ప్రతినెలా 1,2 & 3 తేదీలలో పోస్టు చేయబడును.

సం॥ర చందా రూ. 100/-, జీవిత చందా రూ. 1000/- (12 సంవత్సరముల వరకు మాత్రమే), ఎమ్.ఓ/స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కత్తిపూడి అకౌంట్ నెం. 11003309435, ఆన్‌లైన్ ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

ఎమ్.ఓ.ఫారమ్‌లో దిగువ ఫర్ కమ్యూనికేషన్ భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.

చందాకాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొనవలెను. మీ అడ్రస్ మార్పు జరిగితే, ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి. చందా వివరములు తెలుపని యెడల సొమ్ము విరాళముగా జమచేయబడును.

కార్యదర్శి, శ్రీ శాంతి ఆశ్రమం (పోస్ట్)

వయా శంఖవరం - 533 446, తూ.గో.జిల్లా

# విన్నపము

విదేశములలో వుండు ఆశ్రమ భక్తులు విరాళములు ఈ క్రింది ఎఫ్.సి.ఆర్.ఎ (Foreign Contributions Regulation Act) బ్యాంక్ అకౌంట్‌కు తమ యొక్క నివసించే ప్రాంతములోని తమ బ్యాంక్ అకౌంట్ నుండి ఆదేశ కరెన్సీలో పంపగలరు. పంపిన పిదప వివరములు srisanthiashram@gmail.com అనే మెయిల్ ఐడికి మరియు mattavvs07@gmail.com కి తప్పకుండా పంపవలెను.

బ్యాంకు పేరు : State Bank of India, 11 Sansad Marg, New Delhi-110001
A/c Name : THE MISSION OF PEACE - FCRA A/c No : 40127798428
Swift Code : SBININBB104

**1. మాతృ ఆశ్రమం**
శ్రీ శాంతి ఆశ్రమము
తోటపల్లి కొండలు, పిన్ : 533 446.
వయా శంఖవరం, తూ.గో.జిల్లా.
సెల్ : 7382009962
రిసెప్షెన్ : 6305349677
e-mail:srisanthiashram@gmail.com

**2. విశాఖ : శాంతి ఆశ్రమము**
లాసన్స్‌బే, పెదవాల్తేరు – 530 017
విశాఖపట్నం.
ఫోన్ : 0891 – 2538689
e-mail : srisanthiashramvsp@gmail.com

**3. విశ్వశాంతి క్షేత్రం**
కైలాసగిరి, విశాఖపట్నం

**4. కోటగిరి శాఖ**
పీస్ సెంటర్, డార్‌మోనా రోడ్,
కోటగిరి – 643217, నిలగిరి జిల్లా.
తమిళనాడు.
ఫోన్ : 04266–271945
e-mail : vsvmsktg@yahoo.com
vsvmsktg@gmail.com

**5. కాకినాడ శాఖ**
శాంతి ఆశ్రమము, అశోక్ నగర్
కాకినాడ – 533 004.
తూ.గో.జిల్లా

**6. పిఠాపురం శాఖ**
స్టువర్టు పేట,
పిఠాపురం–533 450. తూ.గో.జిల్లా.

**Website : www.srisantiashram.org**

# దైవ సాయుజ్యము

**తేది 14–08–2021 కె. శ్రీనివాస్** (రిటైర్డ్ ఎలక్ట్రికల్ ఇంజనీయరు) విశాఖపట్నం. వీరు టాటా స్టీల్స్ నుండి పదవీ విరమణ పొందినప్పటినుండి గత 15 సం॥ల నుండి వైజాగ్ శాంతి ఆశ్రమమునకు అన్ని రకములైన ఎలక్ట్రికల్ పనుల వ్యవహారములతో శతధా సహాయపడుచు సేవ చేసిరి. స్వామీజీ వారి కుటుంబమునకు ఆత్మస్థైర్యమును ఒసంగుగాక.

# బ్రహ్మైక్యం

**తేది. 14–08–2021 స్వామీ రామస్వరూపానంద**, ఉత్తరకాశి. వీరు స్వామి చిదానంద శిష్యులు. స్వామి చిదానందతో కలసి మాతృ ఆశ్రమానికి తరచు వస్తూ వుండేవారు. ఓంకార స్వామి సన్నిహితులు ప్రపంచమంతా శ్రీ ఓంకార స్వామీ గారి శాంతి సిద్ధాంతమును వ్యాపింపచేశారు.

# కార్యక్రమములు – మాతృ ఆశ్రమం

**తేది 06–09–2021 (సోమవారం)** పోలాల అమావాస్య సందర్భంగా ఉ॥ 9.30 గం॥లకు శ్రీ దుర్గా అష్టోత్తర శతనామార్చన (అన్నపూర్ణ సదన్)

**తేది 08–09–2021 (బుధవారం)** పూజ్యశ్రీ స్వామి శివానంద మహరాజ్ వారి జయంతి సందర్భంగా పాదుకా అష్టోత్తర శతనామార్చన జరుపబడును.

**తేది 10–09–2021 (శుక్రవారం)** వినాయకచతుర్థి సందర్భంగా ఉ॥ 8.30 ని॥లకు శాంతి గణపతికి అష్టోత్తర శతనామార్చన

**తేది 24–09–2021 (శుక్రవారం)** పూజ్యశ్రీ స్వామి చిదానంద మహరాజ్ వారి జయంతి సందర్భముగా పాదుకా అష్టోత్తర శతనామార్చన జరుపబడును. పూజలన్నియు శ్రీ గణేష్ ఆచార్య శ్రీ గంగరాజు మాస్టారు గార్లచే నిర్వహించబడును.

# శాశ్వత అన్నదానం

1. శ్రీ నీరుకొండ వీరవెంకట సత్యనారాయణ గారు 20,000/-
శ్రీ నీరుకొండ కొండల రావు గారు (యర్రవరం)
వీరి తండ్రి గారు కీ॥శే॥ నీరుకొండ తిరుపతి రావు గారి జ్ఞాపకార్థం
2. శ్రీ మాదాసు కిషోర్ చక్రవర్తి గారు, శ్రీమతి పుప్పాల శ్రావణి గారు 10,000/-
(హైదరాబాద్) వీరి కుమార్తె ఎమ్. చైత్రగారి పుట్టినరోజు సందర్భముగా

## విరాళములు

1. శ్రీ సానిపిని వీర్రాజు గారు, శ్రీమతి వీరాయమ్మ గారు (వేట్లపాలెం) 8000/-
గిత్తలషెడ్ నిర్మాణము నిమిత్తం
2. శ్రీమతి చర్ల సుశీల గారు (నిడదవోలు) 10,000/-
అన్నదానం నిమిత్తం
3. శ్రీ పి.వి.వి. భగవాన్ గారు (పెద్దాపురం) 3,835/-
శాంతమ్మగారి సమాధి మందిరం రిపేర్సు నిమిత్తం
4. శ్రీమతి గరిమెళ్ళ రేణుకా శ్రీనివాస్ గారు (హైదరాబాద్) 4,400/-
అఖండ దీపారాధన నిమిత్తం 2 డబ్బాలు కొబ్బరి నూనె
5. డా॥ భరతుల కృష్ణరాం గారు (న్యూఢిల్లీ) 13,850/-
సోలార్ సిస్టం నిమిత్తం
6. శ్రీ డి. సూర్యనారాయణ గారు (కాకినాడ) 2,000/-
7. శ్రీ గొల్లపూడి నాగేశ్వరరావు గారు (శాంతి ఆశ్రమం) 1000/-
8. శ్రీ తేజగారు (కాకినాడ) 6000/-
9. శ్రీ షరాబ్ గారు (కాకినాడ) 6000/-
10. శ్రీమతి పుష్పలత గుప్త గారు (హైదరాబాద్) 3000/-
గోగ్రాసం నిమిత్తం
11. శ్రీ చేతన్ రెడ్డి గారు (హైదరాబాద్) 6000/-
అన్నదానం నిమిత్తం
12. శ్రీ రామచంద్రా మిషన్ (కాకినాడ) 5000/-
13. శ్రీ ఖండవిల్లి వెంకటేశ్వరరావు గారు (వేళంగి) 6000/-
14. ఒక భక్తుడు 5001/-
15. శ్రీ రాంనివాస్ గుప్తా గారు (హైదరాబాద్) 25,000/-
16. శ్రీమతి తారాగుప్తా గారు (హైదరాబాద్) 25,000/-
17. శ్రీ ఖండవిల్లి శేషగిరిరావు గారు (చోడవరం) 3000/-
18. ప్రీతాసింగ్ గారు (హైదరాబాద్) 10,000/-

# శ్రీ శాంతి ఆశ్రమ ప్రచురణలు

1. శాంతి ప్రదాత శ్రీస్వామి ఓంకార్ ఆత్మకథ ........ 100/-
2. ఓంకార సద్బోధామృతము ........ 70/-
3. సోహం ........ 10/-
4. ఓం జపం ........ 10/-
5. మౌనపు ఘడియలు ........ 30/-
6. ప్రేమయే దైవము ........ 10/-
7. భగత్సాక్షాత్కారము ఇప్పుడు ఇక్కడే ........ 10/-
8. శాంతి దళములు ........ 10/-
9. ఆధ్యాత్మిక మెరుపులు ........ 10/-
10. సత్సంగ సందేశములు ........ 30/-
11. ఓంకార సూక్తులు ........ 10/-
12. ఓంకార స్తోత్ర కదంబం ........ 10/-
13. శాంతి సూక్తులు ........ 10/-
14. శాంతి ప్రార్థన ........ 20/-
15. శ్రీ శాంతి స్తోత్రమాల ........ 30/-
16. స్వామి ఓంకార్ ఆత్మదర్శిని ........ 20/-
17. సందేశ తరంగిణి ........ 40/-
18. నా చెల్లి పునర్జన్మ ........ 10/-
19. నేను ఆంగ్లభాష ఎలా నేర్చుకొన్నాను ........ 20/-
20. శ్రీ శ్రీ శ్రీ ఓంకారస్వామి స్తోత్రము ........ 20/-
21. శాంతిదూత స్వామి ఓంకార్ ........ 30/-
22. స్వామి ఓంకార్ జీవిత విశేషాలు ........ 10/-
23. శ్రీ శాంతి ఆశ్రమ చరిత్ర ........ 20/-
24. ధ్యానము ........ 30/-
25. పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ వారి దివ్య సందేశములు దేశ విదేశీయ పర్యటనలు... 50/-
26. ప్రార్థనలు - ధ్యానములు ........ 20/-
27. విశ్వప్రార్థన ........ 20/-
28. శ్రీ శాంతి ఆశ్రమం శతాబ్ధి సంచిక ........ 120/-
29. నిత్య సందేశములు ........ 20/-
30. ఆంతర్య భావనలు ........ 20/-
31. శ్రీ ఓంకార బోధామృతం ........ 20/-
32. నాల్గు దశలలో ఉపదేశము ........ 10/-
33. శాంతి ప్రార్థన - స్వామి ఓంకార్ ........ 20/-

This Periodical is Registered with Registrar of Newspapers, New Delhi Vide R.No. 3447/57, Dt. 18-12-20 Permitted to Post Under Concessional Postage Vide AP/KD-24/2021-2023

## SRI SANTI ASHRAM ENGLISH PUBLICATIONS

1. Auto Biography of Swami Omkar (2 Volumes) .......... Rs. 150/-
2. Life and Teachings of Swami Omkar .......................... Rs. 10/-
3. Soham ........................................................................ Rs. 10/-
4. Cosmic Fast ...............................................................Rs. 20/-
5. Meditation...................................................................Rs.10/-
6. Om Japa .....................................................................Rs.10/-
7. Control of Mind ...........................................................Rs.30/-
8. Cosmic Flashes ..........................................................Rs.10/-
9. In the Hours of Silence ............................................. Rs.10/-
10. The Soul of Omkar .....................................................Rs.10/-
11. How I learned English ...............................................Rs.10/-
12. Reincarnation of my Little Sister ................................Rs.10/-
13. God Realization Now and Here ...................................Rs.10/-
14. Mystic Prayers and Poems ........................................Rs.20/-
15. The Divine Voice of Omkar ........................................Rs.40/-
16. Auto Biography of Omkar (Revised Edition) .............Rs.100/-
17. Petals of Peace ..........................................................Rs.20/-
18. The Story of my life and Work ....................................Rs.10/-
19. Priceless legacy of Swami Omkar ..............................Rs.10/-
20. The Four Initiations ....................................................Rs.10/-
21. Musings .....................................................................Rs.20/-
22. Peace Prayer .............................................................Rs.20/-

THE MISSION OF PEACE
శ్రీ శాంతి ఆశ్రమము
పోస్టు : శాంతి ఆశ్రమము
(వయా) శంఖవరం - 533 446.
తూ॥గో॥జిల్లా., (ఆ.ప్ర.)
ఫోన్ : 7382009962
email:srisanthiashram@gmail.com
www :www.srisantiashram.org.in

Printed Book

To

Printed by Swamy Offset Printers and Published by Swamini Vinamrananda on behalf of The Mission of Peace Sri Santi Ashram and Printed at Swamy Off-set Printers, Pithapuram - 533 450 Cell : 98485 19829 and Published at Thotapalli Hills 533 446 Ph : 7382009962 Editor : Swamini Vinamrananda.